



# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక | PEN POWER TELUGU DAILY | ప్రశ్నించడం మన హక్కు

సంపుటి : 12 సంచిక : 121 పేజీలు :8 | సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) | ప్రచురణ : విశాఖపట్నం | మంగళవారం 6 జనవరి 2026 | వెల : 1/-రూ ॥

VOLUME :12 ISSUE :121 PAGES :8 | EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) | PUBLISHED : VISAKHAPATNAM | TUE 6 JANUARY 2026 | PRICE : 1/- RS

Simultaneously Published form Visakhapatnam,Kakinada,Bapatla,NarasaraoPeta,Ongole,YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur


## బియ్యం ఉత్పత్తిలో మనమే నెంబర్ వన్... చైనాను దాటేసిన భారత్

- ప్రపంచంలోనే అతిపెద్ద బియ్యం ఉత్పత్తిదారుగా భారత్
- 184 కొత్త పంట వంగడాలను విడుదల చేసిన కేంద్ర ప్రభుత్వం
- దిగుబడి పెంచే విత్తనాల అభివృద్ధిలో కీలక ముందడుగు
- పప్పులు, నూనె గింజల ఉత్పత్తి పెంచాలని శాస్త్రవేత్తలకు సూచన



పెన్ పవర్ డెస్క్:బియ్యం ఉత్పత్తిలో భారత్ సరికొత్త రికార్డు సృష్టించింది. ఇప్పటివరకు అగ్రస్థానంలో ఉన్న చైనాను అధిగమించి ప్రపంచంలోనే అతిపెద్ద బియ్యం ఉత్పత్తిదారుగా అవతరించింది. ఈ విషయాన్ని కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ సోమవారం ఢిల్లీలో వెల్లడించారు. భారత్ 150.18 మిలియన్ టన్నుల బియ్యాన్ని ఉత్పత్తి చేయగా, చైనా ఉత్పత్తి 145.28 మిలియన్ టన్నులకే పరిమితమైందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా భారత వ్యవసాయ పరిశోధన మండలి (ఐసీఏఆర్) అభివృద్ధి చేసిన 25 రకాల పంటలకు చెందిన 184 కొత్త వంగడాలను మంత్రి విడుదల చేశారు. అధిక దిగుబడినిచ్చే విత్తనాల అభివృద్ధిలో భారత్ గొప్ప విజయం సాధించిందని, ఇప్పుడు ప్రపంచ మార్కెట్లకు బియ్యాన్ని

వివరాలు 2లో..

## జగన్ సర్కారు అక్రమాలను కాగ్ బట్టబయలు చేసింది

- నకిలీ బిల్లులు, అనధికార పెన్షన్లతో ఖజానాకు భారీ నష్టం జరిగిందని విమర్శ
- పీపీపీ విధానం, భోగాపురం ఎయిర్‌పోర్టుపై వైసీపీది క్రెడిట్ చోరీ యత్నమని ధ్వజం
- సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ కృషితోనే రాష్ట్రానికి కంపెనీలు క్యూ కడుతున్నాయని వెల్లడి



పెన్ పవర్ డెస్క్:దేశంలోకి వచ్చిన పెట్టుబడులను ఆకర్షించడంలో ఆంధ్రప్రదేశ్ అగ్రస్థానంలో నిలవడం రాష్ట్రానికి గర్వకారణమని ప్రభుత్వ విప్, టీడీపీ ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. అదే సమయంలో, గత వైసీపీ ప్రభుత్వం సంక్షేమం పేరుతో రాష్ట్రాన్ని తీవ్ర ఆర్థిక సంక్షోభంలోకి నెట్టిందని, కాగ్ నివేదిక ఈ అక్రమాలను బట్టబయలు చేసిందని ఆయన తీవ్రంగా విమర్శించారు. సోమవారం నాడు మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వంపై విశ్వాసంతోనే ప్రపంచ దిగ్గజ కంపెనీలు రాష్ట్రానికి తరలివస్తున్నాయని తెలిపారు.

వివరాలు 2లో..



## సీమకు కూటమి ప్రభుత్వం చేస్తున్న అన్యాయం తెలంగాణ అసెంబ్లీ వేదికగా వెల్లడయింది

- రాయలసీమ ఎత్తిపోతల పథకం ఆగడానికి చంద్రబాబే కారణమన్న భూమన
- రాయలసీమను తాకట్టు పెట్టారని మండిపాటు
- వైసీపీ హయాంలో జగన్ రూ. 7 వేల కోట్ల పనులు ప్రారంభించారని వెల్లడి

పెన్ పవర్ డెస్క్:ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబుపై వైసీపీ మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి మరోసారి విమర్శలు గుప్పించారు. రాయలసీమ ఎత్తిపోతల పథకం ఆగిపోవడానికి కారణం చంద్రబాబే అని ఆయన అన్నారు. సీమకు కూటమి ప్రభుత్వం ఎంత అన్యాయం చేస్తోందో తెలంగాణ అసెంబ్లీ

వివరాలు 2లో..

# వీసీలు కేవలం పరిపాలన అధిపతులు కాదు

- వీసీలు సంస్కరణల రాయబారులుగా పనిచేయాలన్న లోకేశ్
- జ్ఞాన ఆధారిత సమాజ నిర్మాణంలో యూనివర్సిటీలదే కీలకపాత్ర అని వెల్లడి
- పాఠ్యాంశాలు, పరిశ్రమల అవసరాల మధ్య అంతరం తగ్గాలని వ్యాఖ్యలు
- బోధన, ఉపాధి, పరిశోధనలపై వీసీలకు 5 కీలక సూచనలు

పెన్ పవర్ డెస్క్: వైస్ ఛాన్సలర్లు (వీసీలు) కేవలం పరిపాలన అధిపతులుగా మిగిలిపోకూడదని, విద్యారంగాన్ని నడిపించే నాయకులుగా, సంస్కరణల రాయబారులుగా పనిచేయాలని రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ పిలుపునిచ్చారు. జ్ఞాన ఆధారిత సమాజాన్ని నిర్మించడంలో విశ్వవిద్యాలయాల పాత్ర అత్యంత కీలకమని ఆయన స్పష్టం చేశారు. సోమవారం అమరావతిలో రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ అధ్యక్షతన జరిగిన పబ్లిక్ యూనివర్సిటీల వైస్ ఛాన్సలర్ల సమీక్షా సమావేశంలో లోకేశ్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు.

తన పాదయాత్రలో ఎంతో మంది యువతను కలిశానని, సర్టిఫికెట్లు చేతిలో ఉన్నా ఉద్యోగాలు లేక గందరగోళంలో ఉన్నారని లోకేశ్ ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే సవాళ్లతో కూడిన విద్యాశాఖను తీసుకున్నానని తెలిపారు. రాష్ట్రంలోని ఉన్నత విద్యలో ప్రధానంగా ఐదు అంశాలపై దృష్టి సారించాలని వీసీలకు దిశానిర్దేశం చేశారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా పాఠ్యాంశాల్లో మార్పులు



తీసుకురావాలని, విద్యార్థులకు ఇంటర్న్‌షిప్‌లు, ప్లేస్‌మెంట్‌లు పెంచి ఉపాధి అవకాశాలు మెరుగుపరచాలని సూచించారు. "డిగ్రీలు పూర్తిచేసినా ఉద్యోగం రాక మన విద్యార్థులు అమీర్‌పేటలో శిక్షణ పొందితే కానీ ఉద్యోగం సాధించలేకపోతున్నారు. ఇది విద్యార్థుల వైఫల్యం కాదు, మన సంస్థల వైఫల్యం" అని

వివరాలు 2లో..

## అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ ఇంటి వద్ద దుండగుడి కలకలం

- అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ నివాసం వద్ద ఘటన
- ఒక అనుమానితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు
- ఇంటి కిటికీ అద్దాలు పగిలిపోయినట్లు గుర్తింపు
- ఘటన జరిగినప్పుడు వాన్స్ కుటుంబం ఇంట్లో లేదన్న అధికారులు
- సీక్రెట్ సర్వీస్, స్థానిక పోలీసుల సంయుక్త దర్యాప్తు



వివరాలు 2లో..

## కోనసీమలో ఓఎన్జీసీ సైట్ వద్ద భారీ అగ్నిప్రమాదం...

### మంత్రులను అప్రమత్తం చేసిన సీఎం చంద్రబాబు

- కోనసీమ జిల్లా మలికిపురంలో ఓఎన్‌జీసీ డ్రిల్ సైట్‌లో గ్యాస్ లీక్
- మరమ్మతు పనుల సమయంలో భారీగా ఎగిసిపడిన మంటలు
- రెండు గంటల పాటు కొనసాగిన లీకేజీతో స్థానికుల్లో తీవ్ర భయాందోళన
- పరిస్థితి అదుపులోకి తెచ్చిన అధికారులు, సహాయక చర్యలు ముమ్మరం



పెన్ పవర్ డెస్క్:కోనసీమ జిల్లాలో తీవ్ర ఆందోళన నెలకొంది. మలికిపురం మండలం ఇరుసుమండ గ్రామంలోని ఓఎన్జీసీ డ్రిల్లింగ్ సైట్‌లో భారీ గ్యాస్ లీకేజీ జరిగి, పెద్ద ఎత్తున మంటలు

వివరాలు 2లో..

## మాతృభాష మన మూలాలకు, మన సంస్కృతికి ప్రతీక

- గుంటూరులో ప్రపంచ తెలుగు మహాసభలకు హాజరైన సీఎం చంద్రబాబు
- రాజమహేంద్రవరంలో తెలుగు విశ్వవిద్యాలయం ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడి
- ప్రపంచవ్యాప్తంగా 10 కోట్ల మంది తెలుగు మాట్లాడుతున్నారని వ్యాఖ్య
- తెలుగువారి ఆత్మగౌరవాన్ని ఎన్టీఆర్ చాటిచెప్పారని కొనియాడిన సీఎం




పెన్ పవర్ డెస్క్:మాతృభాష మన మూలాలకు, మన సంస్కృతికి ప్రతీక అని, ప్రపంచంతో పోటీ పడేందుకు ఆంగ్లం అవసరమే అయినప్పటికీ మాతృభాషను విస్మరిస్తే మన ఉనికినే కోల్పోయినట్లు అవుతుందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. రాజమండ్రిలో తెలుగు విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేస్తున్నామని ఆయన ప్రకటన చేశారు. గుంటూరులోని శ్రీ సత్యసాయి ఆధ్యాత్మిక నగరంలో మూడు రోజులుగా జరుగుతున్న మూడో ప్రపంచ తెలుగు

వివరాలు 2లో..

## గాలిలోని కాలుష్యంతో ఇంధనం..

### ఐఐటీ గువాహటి శాస్త్రవేత్తల అద్భుత ఆవిష్కరణ



- గాలిలోని కార్బన్ డై ఆక్సైడ్‌ను ఇంధనంగా మార్చే టెక్నాలజీ
- ఐఐటీ గువాహటి పరిశోధకుల సరికొత్త ఆవిష్కరణ
- సూర్యరశ్మిని ఉపయోగించి జూ2ను మిథనాల్ ఇంధనంగా మార్పు
- పరిశ్రమల నుంచి వెలువడే కాలుష్యాన్ని తగ్గించడంలో కీలకం
- గ్రాఫిటిక్ కార్బన్ నైట్రైడ్, గ్రాఫీన్ మిశ్రమంతో ప్రత్యేక పదార్థం రూపకల్పన

వివరాలు 2లో..

## వృత్తి జీవితానికి 'ఏఐ' హానికరమని మాట్లాడటాన్ని ఆపేయాలి

- కృత్రిమ మేధలో భారీ మార్పులు వస్తాయన్న సత్య నాదెళ్ల
- మానవ సామర్థ్యాలను పెంచడానికి ఏఐ ఒక టూల్‌గా ఉంటుందన్న సత్య నాదెళ్ల
- ఏఐ పరిశ్రమ కొత్తదనం నుంచి మరిన్ని సవాళ్ల సమయంలోకి అడుగు పెట్టిందని వ్యాఖ్య



పెన్ పవర్ డెస్క్:కృత్రిమ మేధ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్-ఏఐ) కారణంగా వృత్తి జీవితానికి హానికలుగుతుందనే వాదనలను నిలిపివేయాల్సిన సమయం ఆసన్నమైందని మైక్రోసాఫ్ట్ సీఈవో సత్య నాదెళ్ల అభిప్రాయపడ్డారు. 'లుకింగ్ ఎహెడ్ 2026' పేరిట ఆయన తన బ్లాగ్‌లో పలు అంశాలను పంచుకున్నారు. కృత్రిమ మేధలో గణనీయమైన మార్పులు చోటుచేసుకుంటాయని ఆయన పేర్కొన్నారు. ఈ సాంకేతికతకు సంబంధించి, ప్రతి ఒక్కరూ కొత్తదనపు దశను అధిగమించి,

వివరాలు 2లో..

## ఎడిటర్ వ్యూ

# ప్రపంచంలో 140 మిలియన్ల అభాగ్య అనాథలు

18 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న పిల్లలు ఏదైనా కారణం వల్ల తల్లిదండ్రులలో ఒకరిని లేదా ఇద్దరినీ కోల్పోవడాన్ని అనాథగా నిర్వచించింది. తల్లిదండ్రులను కోల్పోవడం చాలా కష్టం, కానీ యుద్ధం కారణంగా తల్లిదండ్రులను కోల్పోవడం మరింత దారుణం. తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లల దుస్థితిని ఒకే రోజుకు పరిమితం చేయలేము, కానీ వారిని జీవితాంతం వేటాడుతూనే ఉంటుంది. ప్రపంచవ్యాప్తంగా, లక్షలాది మంది పిల్లలు యుద్ధం, ఇతర సంఘర్షణల కారణంగా అనాథలుగా మారారు, బాధాకరమైన పరిస్థితులకు గురవుతున్నారు. అనాథశ్రమాలలో పెరిగే పిల్లలు చాలా భావోద్వేగపరంగా, సున్నితంగా ఉండటానికి కారణాలుగా యుద్ధాలు, కరువుకాటకాలు, వ్యాధులు, పేదరికం లేదా ప్రత్యక్ష గాయాలు వంటి సమస్యలను ఎదుర్కొని ఉండవచ్చు.

**ప్రపంచవ్యాప్తంగా 140 మిలియన్ల అనాథలు:**

ప్రపంచవ్యాప్తంగా 140 మిలియన్లకు పైగా అనాథలు ఉన్నారు, వీరిలో ఆఫ్రికాలో 52 మిలియన్లు, కరేబియన్ - లాటిన్ అమెరికాలో 10 మిలియన్లు, ఆసియాలో 61 మిలియన్లు, తూర్పు ఐరోపా - మధ్య ఆసియాలో 7.3 మిలియన్లు ఉన్నారు. 95% అనాథలు 5 సంవత్సరాల కంటే ఎక్కువ వయస్సు కలిగిన వారే ఉన్నారు. యుద్ధ మరణాలలో సగం మంది పౌరులు యుద్ధ అనాథలుగా ఆకలి, అనారోగ్యం, పోషకాహార లోపం, నిరక్షరాస్యత వంటి భయంకరమైన పరిస్థితుల్లో జీవిస్తున్నారు. సుమారు 1,50,000 మంది పాలస్తీనియన్లు ఈ ప్రాంతాన్ని విడిచిపెట్టగా, 70,000 మంది వరకు ప్రాణాలు కోల్పోయారని భావిస్తున్నారు, వారిలో సగానికి పైగా మహిళలు మరియు పిల్లలు ఉండడం విచారకరం. అత్యంత దయనీయ స్థితిలో రోడ్లపై నిలబడి ఉన్న అనేక మంది యుద్ధ అనాథలకు భవిష్యత్తు అంధకారంగా మారింది. ఇజ్రాయెల్-పాలస్తీనా యుద్ధం సమయంలో గాజా జనాభా పూర్తిగా తగ్గిపోయింది. 2025 చివరి నాటికి రష్యా ఉక్రెయిన్‌పై దాడి చేసినప్పుడు దాదాపు 53,000 మంది పౌర మరణాలు సంభవించాయి. ప్రస్తుతం ఈ రెండు యుద్ధాల వల్ల అత్యంత దయనీయమైన పరిస్థితుల్లో నివసిస్తున్న యుద్ధ అనాథల సంఖ్య గణనీయంగా పెరిగింది.

ప్రపంచ యుద్ధ అనాథల దినోత్సవం-2026:

యుద్ధ అనాథలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించడానికి, వారి పెరుగుదల సమయంలో వారు ఎదుర్కొనే శారీరక, మానసిక, సామాజిక మార్పులను హైలైట్ చేయడానికి ప్రతి సంవత్సరం జనవరి 06న "ప్రపంచ యుద్ధ అనాథల దినోత్సవాన్ని" జరుపుకుంటారు. యుద్ధం వంటి అకాల, కఠినమైన సంఘటనలలో తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లలు బతికి ఉన్న కుటుంబ సభ్యులతో ఉండవలసి రావడం లేదా వారు అనాథశ్రమాల్లోకి చేరడం, పోషకాహార లోపాలు, వ్యాధుల వ్యాప్తి వంటి దుర్భర పరిస్థితులను ఎదుర్కొంటారు. ఈ రోజున అనాథశ్రమాలకు గరిష్టంగా విరాళాలు అందించడం, అనాథలతో కొంత నాణ్యమైన సమయాన్ని గడపడానికి అనాథ గృహాలను సందర్శించడం, అనాథల దుస్థితిపై సాధారణ ప్రజలకు అవగాహన కల్పించడానికి కార్యక్రమాలను నిర్వహించడం వంటివి ప్రణాళిక చేయవచ్చు. అనాథలకు సొంత తల్లిదండ్రులు లేరు, కానీ వారికి చాలా మంది మనలాంటి సామాజిక తల్లిదండ్రులు ఉన్నారు. ప్రపంచంలో ఒక రొట్టె ముక్క కోసం చనిపోతున్న వారు చాలా మంది ఉన్నారు, కానీ కొంచెం ప్రేమ, వెచ్చని కౌగిలింత కొరవడి చనిపోతున్న వారు ఇంకా చాలా మంది ఉన్నారు. అలాంటి అనాథలను అక్కున చేర్చుకొని మానవత్వం ఇంకా బతికే ఉందని రుజువు చేద్దాం

# వీసీలు కేవలం పరిపాలన అధిపతులు కాదు

- మొదటి పేజీ తరువాయి

మంత్రి లోకేశ్ అన్నారు. పరిశోధనలు కేవలం ప్రచురణలకే పరిమితం కాకుండా సమాజానికి ఉపయోగపడేలా ఉండాలన్నారు. ప్రతి వారం విద్యార్థులతో నేరుగా మాట్లాడేందుకు 'ఓపెన్ హౌస్' నిర్వహించాలని వీసీలను కోరారు. అందరి కృషితో రాష్ట్రంలోని ప్రభుత్వ విశ్వవిద్యాలయాలను ప్రపంచస్థాయి సంస్థలుగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని లోకేశ్ స్పష్టం చేశారు.

**ఉన్నత విద్యలో 5 సవాళ్లు**

ప్రస్తుతం ఉన్నత విద్యారంగం ఐదు ప్రధాన సవాళ్లను ఎదుర్కొంటోందని మంత్రి లోకేశ్ విశ్లేషించారు.

1. బోధన-అవసరాల మధ్య అంతరం: పరిశ్రమల అవసరాలకు, మనం బోధిస్తున్న పాఠ్యాంశాలకు మధ్య తీవ్ర వ్యత్యాసం ఉంది. దీనివల్ల మన డిగ్రీలకు అంతర్జాతీయంగా డిమాండ్ తగ్గుతోంది. ప్రపంచ ప్రఖ్యాత స్టాన్‌ఫర్డ్ యూనివర్సిటీ సైతం ఎప్పటికప్పుడు తమ పాఠ్యాంశాలను పూర్తిగా మారుస్తోందని, మనం కూడా కాలానుగుణంగా సిలబస్‌ను నవీకరించాలని సూచించారు.
2. ఉద్యోగావకాశాలు లేని డిగ్రీలు: ఇంటర్న్‌షిప్‌లు, ప్లేస్‌మెంట్ వ్యవస్థలు సరిగా లేకపోవడంతో మన డిగ్రీలకు విశ్వసనీయత కొరవడుతోంది. మన వర్సిటీల నుంచి పట్టభద్రులైన విద్యార్థులు ఉద్యోగాలు సాధించలేకపోతుండగా, అమీర్‌పేటలో నాలుగు నెలల శిక్షణతో ఉద్యోగాలు పొందుతున్నారని, ఇది విద్యార్థుల వైఫల్యం కాదని, మన విద్యాసంస్థల వైఫల్యమని స్పష్టం చేశారు.
3. ప్రయోజనం లేని పరిశోధనలు: పరిశోధనలు కేవలం ప్రచురణలకే పరిమితం కాకుండా, సమాజానికి ఉపయోగపడే ఆవిష్కరణలుగా మారాలి. నీటికొరత, వాతావరణ మార్పులు వంటి సమస్యలకు వర్సిటీలు పరిష్కారాలు చూపాలి.
4. పరిపాలనా భారం: అధ్యాపకులు, వీసీలు బోధన కంటే పరిపాలనపైనే ఎక్కువ సమయం వెచ్చిస్తున్నారు. ఈ పాత పద్ధతులు వీడి, అకడమిక్ ప్రమాణాలపై దృష్టి సారించాలి.
5. విద్యార్థుల అనుభవంలో లోపాలు: విద్యార్థులకు సరైన మార్గదర్శకత్వం, మానసిక మద్దతు కొరవడుతోంది. దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది.

**భవిష్యత్ కార్యాచరణ ఇదే**

ఈ సవాళ్లను అధిగమించేందుకు పాత పద్ధతులను విడనాడి, విద్యావ్యవస్థను పూర్తిగా ప్రక్షాళన చేయాలని లోకేశ్ పిలుపునిచ్చారు. రాబోయే పదేళ్లలో రానున్న ఉద్యోగాల్లో 80 శాతం ఇప్పటికి తెలియని రంగాల్లోనే ఉంటాయని, అందుకు తగ్గట్టుగా యువతను సిద్ధం చేయాలన్నారు. పరిశ్రమలతో అనుసంధానం పెంచి, ఇంటర్న్‌షిప్‌లు, అప్రెంటిస్‌షిప్‌లను తప్పనిసరి చేయాలన్నారు. వర్సిటీలు ఆర్థిక స్వావలంబన సాధించేందుకు పూర్వ విద్యార్థుల నెట్‌వర్క్‌ను వినియోగించుకోవాలని, ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇందుకు చక్కటి ఉదాహరణ అని తెలిపారు. ఈ సమావేశంలో హెచ్‌ఆర్‌డీ కార్యదర్శి కోన శశిధర్, ఉన్నత విద్యామండలి ఛైర్మన్ కె.మధుమూర్తి, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బుడితి రాజశేఖర్ పాల్గొన్నారు.

# అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ ఇంటి వద్ద దుండగుడి కలకలం

అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ నివాసం వద్ద సోమవారం తెల్లవారుజామున కలకలం రేగింది. ఈ ఘటనకు సంబంధించి ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. సీక్రెట్ సర్వీస్, సిన్సినాటి పోలీసులు సంయుక్తంగా ఈ ఘటనపై దర్యాప్తు ప్రారంభించారు. వివరాల్లోకి వెళితే, ఒహాయో రాష్ట్రంలోని సిన్సినాటి నగరంలో సోమవారం అర్ధరాత్రి దాటాక సుమారు 12:15 గంటలకు జేడీ వాన్స్ నివాసం సమీపంలో ఒక వ్యక్తి అనుమానాస్పదంగా పరుగెడుతున్నట్లు సీక్రెట్ సర్వీస్ సిబ్బంది గుర్తించారు. వెంటనే వారు స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు, ఇంటి కిటికీ అద్దాలు పగిలిపోయి ఉండటాన్ని గమనించారు. ఈ ఘటనకు సంబంధించి ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

అయితే, ఈ ఘటన జరిగిన సమయంలో ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, ఆయన కుటుంబ సభ్యులు ఇంట్లో లేరని అధికారులు స్పష్టం చేశారు. సెలవుల అనంతరం ఆదివారమే ఆయన వాషింగ్టన్ డీసీకి బయలుదేరి వెళ్లినట్లు తెలిసింది. అదుపులోకి తీసుకున్న వ్యక్తి ఇంట్లోకి ప్రవేశించే ప్రయత్నం చేయలేదని ప్రాథమికంగా భావిస్తున్నారు. అతడు ఉపాధ్యక్షుడిని లక్ష్యంగా చేసుకుని ఈ చర్యకు పాల్పడ్డాడా అనే కోణంలో దర్యాప్తు కొనసాగుతోంది. ఈ ఘటనపై వైట్ హౌస్ లేదా సీక్రెట్ సర్వీస్ నుంచి ఇంకా ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు.

# గాలిలోని కాలుష్యంతో ఇంధనం..

## ఐఐటీ గువాహటి శాస్త్రవేత్తల అద్భుత ఆవిష్కరణ

పర్యావరణ పరిరక్షణ, హరిత ఇంధన ఉత్పత్తి దిశగా ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ) గువాహటి పరిశోధకులు ఒక కీలక ముందడుగు వేశారు. గాలిలోని హానికారక కార్బన్ డై ఆక్సైడ్‌ను (జూఇ) సూర్యరశ్మి సహాయంతో మిథనాల్ ఇంధనంగా మార్చగల ఒక సరికొత్త పదార్థాన్ని (ఫోటోకెటలిస్ట్) విజయవంతంగా అభివృద్ధి చేశారు. ఈ పరిశోధన వివరాలను ప్రతిష్ఠాత్మక 'జర్నల్ ఆఫ్ మెటీరియల్స్ సైన్స్' ప్రచురించింది.

పెట్రోలియం ఆధారిత ఇంధనాల వాడకం వల్ల వాతావరణంలో కార్బన్ డై ఆక్సైడ్ పెరిగిపోతూ పర్యావరణానికి, భూతాపానికి కారణమవుతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో పెరుగుతున్న ఇంధన అవసరాలను తీరుస్తూనే, పర్యావరణానికి హాని కలగకుండా చూసేందుకు ఈ కొత్త టెక్నాలజీ దోహదపడుతుంది. థర్మల్ పవర్ ప్లాంట్లు, సిమెంట్, ఉక్కు, పెట్రోకెమికల్ పరిశ్రమల నుంచి వెలువడే జూఇను ఇంధనంగా మార్చడం ద్వారా కాలుష్యాన్ని గణనీయంగా తగ్గించవచ్చు. గతంలో గ్రాఫిటిక్ కార్బన్ నైట్రైడ్ అనే పదార్థంతో ఇలాంటి ప్రయత్నాలు జరిగినా, శక్తి నష్టం కారణంగా అవి విఫలమయ్యాయి. అయితే, ఐఐటీ గువాహటి బృందం గ్రాఫిటిక్ కార్బన్ నైట్రైడ్‌కు 'ఫ్యూ-లేయర్ గ్రాఫీన్'ను జోడించి ఈ సమస్యను అధిగమించింది. గ్రాఫీన్ కలపడం వల్ల ఈ మిశ్రమం సూర్యరశ్మిని సమర్థవంతంగా గ్రహించి, శక్తి నష్టాన్ని తగ్గించి, ఎక్కువ సేపు చురుకుగా పనిచేస్తున్నట్లు పరిశోధనలో తేలింది. 15 శాతం గ్రాఫీన్ ఉన్న మిశ్రమం అత్యంత మెరుగైన ఫలితాలను ఇచ్చిందని శాస్త్రవేత్తలు తెలిపారు.

"ఈ పరిశోధన పర్యావరణ సమస్యలను తగ్గించడంతో పాటు, హరిత ఇంధన ఉత్పత్తికి ఎంతగానో దోహదపడుతుంది" అని ఐఐటీ గువాహటి కెమికల్ ఇంజినీరింగ్ విభాగానికి చెందిన ప్రొఫెసర్ మహుయా దే వివరించారు. తదుపరి దశలో ఈ టెక్నాలజీని పెద్ద ఎత్తున పరిశ్రమలలో వాడేందుకు వీలుగా అభివృద్ధి చేయాలని పరిశోధక బృందం లక్ష్యంగా పెట్టుకుంది.

# జగన్ సర్కారు అక్రమాలను కాగ్ బట్టబయలు చేసింది

- మొదటి పేజీ తరువాయి

**కాగ్ నివేదికతో అక్రమాలు బట్టబయలు**

గత ప్రభుత్వంలో జరిగిన ఆర్థిక అవకతవకలపై కాగ్ ఇచ్చిన నివేదికను జగన్ ఓసారి చదువుకోవాలని వెంకట్రావు హితవు పలికారు. "సీఎఫ్ఎంఎస్‌లో డూప్లికేట్ బిల్లులను గుర్తించే వ్యవస్థ లేకపోవడంతో 1,41,917 బిల్లులకు అదనంగా రూ.968 కోట్లు చెల్లించారు. ఎలాంటి లిమిట్ చెక్ లేకుండా 2,545 మందికి అనధికారికంగా పెన్షన్లు చెల్లించి రూ.218.15 కోట్ల నష్టం చేకూర్చారు. పీడీ అకౌంట్ల నుంచి అధికారులకు తెలియకుండానే రూ.71,568 కోట్లు లాప్స్ చేశారు. రాష్ట్ర రెవెన్యూ లోటు రూ.13,899 కోట్ల నుంచి రూ.43,487 కోట్లకు, ఆర్థిక లోటు రూ.52,508 కోట్లకు పెరిగిందని కాగ్ తేల్చింది. అప్పులు తెచ్చి అభివృద్ధికి ఖర్చు చేసింది కేవలం రూ.7,244 కోట్లే. దీనిపై జగన్ సమాధానం చెప్పాలి" అని ఆయన డిమాండ్ చేశారు.

**పీపీపీ, భోగాపురంపై ఎదురుదాడి**

రాష్ట్రంలో పీపీపీ విధానంలో మెడికల్ కాలేజీల ఏర్పాటును వ్యతిరేకిస్తున్న వైసీపీపై ఆయన మండిపడ్డారు. దేశంలోని పంజాబ్, బెంగాల్, యూపీ, గుజరాత్ వంటి రాష్ట్రాలు పీపీపీ విధానంలో మెడికల్ కాలేజీలను అభివృద్ధి చేస్తుంటే, ఇక్కడ మాత్రం వైసీపీ నేతలు డ్రామాలు ఆడుతున్నారని విమర్శించారు. "రుషికొండపై రూ.500 కోట్లతో ప్యాలెస్ కట్టే బదులు, సలహాదారులకు రూ.680 కోట్లు పెట్టే బదులు రెండు మెడికల్ కాలేజీలు పూర్తి చేయొచ్చు. పీపీపీ విధానంపై నాతో బహిరంగ చర్చకు వైసీపీ నేతలు సిద్ధమా?" అని సవాల్ విసిరారు.

ఇక భోగాపురం ఎయిర్‌పోర్టు విషయంలో వైసీపీ క్రెడిట్ చోరీకి పాల్పడుతోందని, ఐదేళ్లు నిర్మాణాన్ని గాలికి వదిలేసి ఇప్పుడు తమ ఖాతాలో వేసుకునే ప్రయత్నం చేస్తోందని దుయ్యబట్టారు. కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు చొరవతోనే పనులు వేగవంతమై ట్రయల్ రన్ విజయవంతమైందని ఆయన స్పష్టం చేశారు.

**పెట్టుబడులకు స్వర్గధామం ఏపీ**

బ్యాంక్ ఆఫ్ బరోడా-సీఎంఈఐ తాజాగా విడుదల చేసిన నివేదిక ప్రకారం, గడిచిన 9 నెలల్లో దేశానికి వచ్చిన మొత్తం పెట్టుబడులలో 25.3 శాతం వాటాతో ఏపీ మొదటి స్థానంలో నిలిచిందని వెంకట్రావు హర్షం వ్యక్తం చేశారు.

"సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ అవిశ్రాంత శ్రమ వల్లే ఫార్చ్యూన్ 500 కంపెనీలు సైతం రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వస్తున్నాయి. మా హయాంలో గన్నవరంలో నిర్మాణం పూర్తి చేసుకున్న అశోక్ లే ల్యాండ్ కంపెనీ, వైసీపీ ప్రభుత్వ విధానాల వల్ల ఉత్పత్తి ప్రారంభించలేదు. ఇప్పుడు మా ప్రభుత్వం రాగానే విశ్వాసంతో ఉత్పత్తి మొదలుపెట్టింది. మేధా టవర్స్‌లో మంత్రి లోకేశ్ మరిన్ని ఐటీ కంపెనీలను ప్రారంభించారు. కానీ, రాష్ట్రానికి మంచి జరగడం వైసీపీకి ఇష్టం లేదు" అని ఆయన అన్నారు.

# బియ్యం ఉత్పత్తిలో మనమే నెంబర్ వన్... చైనాను దాటేసిన భారత్

- మొదటి పేజీ తరువాయి

ఎగుమతి చేసే ప్రముఖ దేశంగా మారిందని అన్నారు. ఈ కొత్త వంగడాలను సాధ్యమైనంత త్వరగా రైతులకు చేరేలా చూడాలని అధికారులను ఆదేశించారు. దేశాన్ని స్వయం సమృద్ధిగా మార్చేందుకు పప్పుధాన్యాలు, నూనె గింజల ఉత్పత్తిపై దృష్టి పెట్టాలని వ్యవసాయ శాస్త్రవేత్తలకు మంత్రి సూచించారు. ప్రధాని మోదీ ప్రభుత్వ హయాంలోని గత 11 ఏళ్లలో 3,236 అధిక దిగుబడినిచ్చే వంగడాలకు ఆమోదం తెలిపినట్లు గుర్తుచేశారు. వాతావరణ మార్పులు, కరవు, నేలల లవణీయత వంటి సవాళ్లను తట్టుకునేలా ఈ కొత్త వంగడాలను రూపొందించినట్లు వివరించారు. ఒకప్పుడు ఆహార కొరత ఎదుర్కొన్న భారత్, ఇప్పుడు ప్రపంచ దేశాలకు వ్యవసాయ ఉత్పత్తులను సరఫరా చేసే స్థాయికి చేరిందని చౌహాన్ హర్షం వ్యక్తం చేశారు. ఐసీఏఆర్, వ్యవసాయ విశ్వవిద్యాలయాలు, ప్రైవేట్ విత్తన కంపెనీల సమిష్టి కృషితోనే ఈ విజయం సాధ్యమైందని ఆయన తెలిపారు.

# వృత్తి జీవితానికి 'ఏఐ' హానికరమని మాట్లాడటాన్ని ఆపేయాలి

- మొదటి పేజీ తరువాయి

వాస్తవ ప్రపంచంపై దాని ప్రభావం పట్ల దృష్టి సారించాలని సూచించారు.

మానవ సామర్థ్యాలను పెంపొందించడానికి ఏఐ ఒక సాధనంగా ఉపయోగపడుతుందని, ఇది మానవులకు ప్రత్యామ్నాయం కాదని ఆయన స్పష్టం చేశారు. ఏఐ వ్యవస్థలను అభివృద్ధి చేయడంలో ఉత్పత్తి రూపకల్పన, సామాజిక అంశాల ప్రాముఖ్యతను గుర్తించాలని ఆయన అన్నారు. ఏఐ పరిశ్రమ కొత్తదనపు దశ నుంచి సవాళ్లతో కూడిన సమయంలోకి ప్రవేశించిందని ఆయన పేర్కొన్నారు. దశాబ్దాలుగా వేలాది కంపెనీలకు సేవలందించిన ఆఫీస్, విండోస్ సాఫ్ట్‌వేర్ స్థానంలో ఏఐ ఏజెంట్లను వినియోగించాలని మైక్రోసాఫ్ట్ భావిస్తోందని ఆయన తెలిపారు.

ఏఐను స్వతంత్ర మేధస్సుగా పరిగణించరాదని ఆయన అభిప్రాయపడ్డారు. మానవ ఆలోచనలను మెరుగుపరిచే, ప్రజల లక్ష్యాల సాధనకు తోడ్పడే ఒక సాధనంగా దీనిని చూడాలని సూచించారు. ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో ఏఐని ఏ విధంగా వినియోగిస్తారనే దానిపై ఈ సాంకేతికత వినియోగం ఆధారపడి ఉంటుందని తెలిపారు. కోపైలట్, అనుబంధ ఉత్పత్తులను బలోపేతం చేయడానికి, మరింత ఆధునిక ఏఐ నమూనాలపై మైక్రోసాఫ్ట్ పెట్టుబడులు పెడుతోందని ఆయన వెల్లడించారు.

# మాతృభాష మన మూలాలకు, మన సంస్కృతికి ప్రతీక

- మొదటి పేజీ తరువాయి

మహాసభల ముగింపు వేడుకల్లో సోమవారం ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ, "సంక్రాంతి కంటే ముందు వచ్చిన పండుగ ఈ ప్రపంచ తెలుగు మహాసభలు. తెలుగువారి ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన మహనీయుడు నందమూరి తారక రామారావు పేరును ఈ వేదికకు పెట్టడం చాలా సంతోషంగా ఉంది" అని పేర్కొన్నారు. తెలుగు భాషకు ఎంతో ఘనమైన చరిత్ర ఉందని, దేశంలో వందలాది భాషలు ఉన్నప్పటికీ ప్రాచీన హోదా పొందిన ఆరు భాషల్లో తెలుగు ఒకటని గుర్తుచేశారు. హిందీ, బెంగాలీ, మరాఠీ తర్వాత దేశంలో అత్యధికంగా మాట్లాడే నాలుగో భాష తెలుగు అని, ప్రపంచవ్యాప్తంగా సుమారు 10 కోట్ల మంది తెలుగు మాట్లాడుతున్నారని వివరించారు. ఈ మహాసభలకు దాదాపు 40 దేశాల నుంచి ప్రతినిధులు హాజరుకావడం తెలుగు భాష గొప్పతనానికి నిదర్శనమని అన్నారు. ఆధునిక తెలుగు భాషకు పితామహుడైన గిడుగు వెంకట రామ్మూర్తి సేవలను తెలుగు జాతి ఎప్పటికీ మరువలేదని చంద్రబాబు కొనియాడారు. "'నేను తెలుగువాణ్ణి.. నాది తెలుగుదేశం' అని గర్వంగా చాటిచెప్పిన ఏకైక నాయకుడు ఎన్టీఆర్" అని ప్రశంసించారు. 1985లోనే ఎన్టీఆర్ ముందుచూపుతో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయాన్ని హైదరాబాద్‌లో స్థాపించారని గుర్తుచేశారు. ఇప్పుడు అదే స్ఫూర్తితో రాష్ట్ర విభజన తర్వాత రాజమహేంద్రవరంలో తెలుగు వర్సిటీని ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకొని భాషను సులభంగా పరిరక్షించుకోవచ్చని చంద్రబాబు సూచించారు. "ప్రస్తుతం ఎన్నో కొత్త యాప్‌లు అందుబాటులోకి వచ్చాయి. మనం తెలుగులో మాట్లాడితే చాలు, అవి సమాధానం చెబుతున్నాయి. టైప్ చేయడం రాని వారు కూడా సాంకేతికత సాయంతో భాషను వినియోగించుకునే సౌలభ్యం ఏర్పడింది" అని వివరించారు. తెలుగు భాష, సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు, వాటిని భావి తరాలకు అందించేందుకు ఇలాంటి మహాసభలు ఎంతో దోహదపడతాయని ఆయన అభిప్రాయపడ్డారు. జనవరి 3న ప్రారంభమైన ఈ మహాసభలు మూడు రోజుల పాటు అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ప్రపంచ నలుమూలల నుంచి తెలుగు భాషాభిమానులు, ప్రముఖులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

# పెన్ పవర్ క్యాలెండరును అవిష్కరించిన కూటమి నేతలు

**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, జనవరి 4:**అల్లూరి సీతారామరాజు జిల్లా, గూడెం కొత్త వీధి మండలం రింతాడ పంచాయతీలో కూటమి నేతలు పెన్ పవర్ యాజమాన్యం ముద్రించిన 2026 క్యాలెండర్‌ను ఘనంగా ఆవిష్కరించారు.ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ, ప్రజా సమస్యలను వెలికితీయటంలో పెన్ పవర్ పత్రిక ముందుండి పనిచేస్తోందని, భవిష్యత్తులో మరింత ప్రజాదరణ పొందే పత్రికగా ఎదగాలని ఆకాంక్షించారు.క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ మొట్టడం శరబన్న దొర, తెలుగుదేశం పార్టీ సంకాడ పంచాయతీ గ్రామ కమిటీ అధ్యక్షులు దేశగిరి గోవిందరావు, జనసేన పార్టీ నాయకులు కొయ్యం బాలు, గబులంగి గణేష్, జయరాజు, తెలుగుదేశం పార్టీ నాయకులు మామిడి చంటిబాబు,దేశగిరి గంగాధర్ తదితరులు పాల్గొన్నారు. క్యాలెండర్ ఆవిష్కరణతో పాటు, కూటమి నేతలు మీడియా ప్రాధాన్యత, ప్రజా సమస్యలకు పరిష్కారానికి మీడియా ప్రయత్నాలను కూడా ప్రశంసించారు.





పెన్ పవర్
ఉత్తరాంధ్ర
శ్రీకాకుళం। మన్యం। విజయనగరం। విశాఖపట్నం। అనకాపల్లి। అల్లూరి జిల్లా

## అక్కడ అభినయ వేదం పదయుక్తమై పరిఢవిల్లింది.




**విశాఖ పెన్ పవర్ జనవరి 5:**భారతీయ సంప్రదాయ నృత్యాలన్నీ ఏకపాదమై ఒకే వేదికమీద బృందాలుగా నర్తించిన తీరును చూసి రత్నాకరుడుకూడా నేనేమి తీసిపోనని కెరటాలను మృదంగనాదంగా చేసుకుని 'తయ్యకు తా ధిమిత'యని నర్తించినటుల భావింప సాగింది ఆ నృత్య సోయగం. సుమారు ఏడువందల యాభైమంది నృత్య కళాకారులు నటరాజకి-లాస్య రాణి పార్వతికి సమర్పించిన నృత్య సేవకి వైశాఖేశ్వరుడు పులకితుడయ్యాడు. జరిగిన ఇంత అద్భుతానికి ఉడా ఎం.జి.యం.పార్కు వేదికైంది. ఇంటర్నేషనల్ ట్రెడిషనల్ డ్యాన్స్ కాంగ్రెస్ 2026 పేరిట నగరానికి చెందిన 'నటరాజ మ్యూజిక్ అండ్ డాన్స్ అకాడమీ 'నాట్య విలాసాన్ని' ఏర్పాటుచేసింది. ఈ నెల రెండు నుంచి నిర్వహిస్తున్న నృత్య పోటీలు, ప్రదర్శనలు సోదాహరణ ప్రసంగాలు, మెగా బృందం నృత్యంతో ముగిసింది. కార్యక్రమాన్ని వి.యం. ఆర్.డి.ఎ. చైర్మన్ ప్రణవ గోపాల్, మాజీ మంత్రివర్యులదాడి రత్నాకర్, ఐటీడీసీ చైర్మన్ కే వి సత్యనారాయణ జ్యోతి వెలిగించి ప్రారంభించారు.

కార్యక్రమంలో సుమారు 750 మంది శాస్త్రీయ నృత్య కళా కారులు కూచిపూడి నాట్యం భరతనాట్యం ఆంధ్రనాట్యాలు ప్రదర్శించడం జరిగింది.

అనంతరం ముఖ్యఅతిథి మాట్లాడుతూ భారతీయ సాంప్రదాయ కళలకి ఇంటర్నేషనల్ స్టాండర్డ్ లో... ఐటిడిసి మహాబృందం నృత్యాలకు విశాఖ వేదికవడం ఎంతో గర్వకారణం అన్నారు. భారతీయ సంప్రదాయ నృత్యాలన్నింటిని ఒకే వేదిమీదకు తీసుకొచ్చే ఆలోచననే అపూర్వ మన్నారు. ఇలాంటి కార్యక్రమాల వలన టూరిజంతోపాటు సాంస్కృతిక పరంగాకూడా నగరం మరింత అభివృద్ధి జరుగుతుం దన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్ర మాల్లో పర్యాటకంగా, సాంస్కృ తిక పరంగాకూడా చాలా ప్రాధాన్యత ఇస్తోందన్నారు. రాబోయే రోజుల్లో ఇలాంటి ఉత్స వాలు విజయవంతంగా జరగడానికి ఈ కార్యక్రమ రథసారథి విక్రమ్ గౌడ్ సహాయ సహకారాలు తీసుకుంటామని తెలియజేశారు.

వి.యం.ఆర్.డి.ఎ. చైర్మన్ గోపాల్ మాట్లాడుతూ వి.యం.ఆర్.డి.ఎ శాస్త్రీయ కళారూపాలని ప్రోత్స హించడానికి ఎప్పుడూ ముందుం టుదని, భారతీయ సంప్రదాయ కలల్ని కూడా వి.యం.ఆర్.డి.ఎ. రాబోయే రోజుల్లో ఏర్పాటు చేస్తుందని అన్నారు.

దాడి రత్నాకర్ మాట్లాడుతూ ఆంధ్ర ప్రదేశ్లో ముఖ్యంగా ఉత్తరాంధ్రలో ఎన్నో జానపద శాస్త్రి కళా రూపా లున్నాయని వాటన్నిటికీ కూడా ఒక వేదిక ఇచ్చి నటరాజ్ మ్యూజిక్ అండ్ అకాడమీ విక్రం గౌడ్ కొన్ని సంవత్సరాలుగా చేస్తున్నటువంటి సర్వీసెస్ ని విజయవంతంగా రాబోయే తరానికి కూడా అందించడానికి ఎంతో దోహద పడతాయని అన్నారు.

ఈ కార్యక్రమంలో ప్రత్యేక అతిథి కార్పొరేటర్, ఇంటర్నేషనల్ బ్యాట్మెంట్ ప్లేయర్ ఉషశ్రీ మాట్లాడుతూ ఐటిడిసి వల్ల యెంతోమంది కళాకారులకు ఒక వేదిక ఏర్పడిందని, ఇటువంటివి చిన్నారులు పాల్గొని పేరు ప్రఖ్యాతలు సంపాదించడానికి సరైన వేదిక ఐటిడిసి అని అన్నారు.

అనంతరం కళాకారులు కూచిపూడి, భరత నాట్యం, ఆంధ్ర నాట్యం తమ నృత్య కౌశ లాన్ని ప్రదర్శించారు. 'పద్మ భూషణ్' వెంపటి చిన సత్యం నృత్య పరికల్పన చేసిన కూచిపూడి సంప్రదాయ బృందం నాట్యం బ్రహ్మాంజలితో ఈ కార్యక్రమం ప్రారంభమైంది. తరువాత కేవీ సత్యనారాయణ 'వినాయక స్తుతితో' కూచిపూడి రెండో అంశాన్ని విద్యార్థులు ప్రదర్శించారు.

భరతనాట్య ప్రదర్శనలో మైసూర్ కు చెందిన డాక్టర్ వసుంధర దొరస్వామి నృత్య దర్శకత్వంలో అలరింపు, జతి స్వరం రెండింటిని కూడా విద్యార్థులు చక్కటిరీతిలో ప్రదర్శించారు. అలాగే ఆంధ్రనాట్య స్రష్ట కళాకృష్ణ నృత్య పరికల్పనలో ఆంధ్ర నాట్యం అంశాన్ని అపురూపంగా ప్రదర్శిం చారు.

ఈ సందర్భంగా మైసూర్ కి చెందిన ప్రముఖ భరతనాట్య కళాకారిణి డాక్టర్ వసుంధర దొరస్వామిని ఐటిడిసి జీవిత సాఫల్య పురస్కారంతో ఘనంగా సన్మానించారు.

## సమగ్ర ప్రణాళికతో విశాఖ ఎకనా మిక్ రీజియన్ అభివృద్ధికి దిశా నిర్దేశం

**వీఈఆర్ అభివృద్ధిపై సమీక్షలో జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్**

**విశాఖ దక్షిణం, పెన్ పవర్, జనవరి 05 :**విశాఖ ఎకనామిక్ రీజియన్ అభివృద్ధిని సమగ్ర ప్రణాళికతో ముందుకు తీసుకెళ్లాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ అధికారు లను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ మీ టింగ్ హాలులో వీఈఆర్ అభివృద్ధిపై నిర్వ హించిన సమీక్షా సమావేశంలో చేపట్టాల్సిన ప్రాజెక్టులు, భూ సేకరణ, మాస్టర్ ప్లాన్ అమలు అంశాలపై విస్తృతంగా చర్చించారు.ఇటీవల రాష్ట్ర ముఖ్యమంత్రి నిర్వహించిన తొలి ఎక నామిక్ రీజియన్ సమీక్ష సమావేశంలో చర్చించి న అంశాలకు అనుగుణంగా రూపొందించిన యాక్షన్ ప్లాన్‌లపై అధికారులు సమగ్రంగా వివరించారు. జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, వీఎంఆర్డీఏ కమిషనర్ తేజ్ భరత్ ఆయా శాఖల పరిధిలో చేపట్టబోయే అభివృద్ధి ప్రాజెక్టులపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. పరిశ్ర మలు, ఐటీ, పర్యాటకం, అర్బన్ డెవలప్‌మెంట్, గ్రీన్ ఎనర్జీ, మౌలిక వసతులు వంటి కీలక రంగా ల్లో విశాఖ రీజియన్ సమగ్ర అభివృద్ధి సాధిం చాలని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. విశాఖను మురికివాడలు లేని నగరంగా అభివృద్ధి చేయ డమే లక్ష్యంగా స్పష్టమైన ప్రణాళికలు రూపొం దించాలని సూచించారు. వీఈఆర్ అభివృద్ధికి అవసరమైన భూ సేకరణ ప్రక్రియను ఎలాంటి వివాదాలు లేకుండా పారదర్శకంగా చేపట్టాలని ఆదేశించారు. పాలసీ ప్రకారం సంబంధిత శాఖ లకు భూమి వివరాల మ్యాపింగ్ పూర్తి చేయా లని తెలిపారు.వీఈఆర్ పరిధిలో రోడ్లు, రైల్వే మార్గాలు, పోర్టులు, లాజిస్టిక్స్ రంగాలకు సం బంధించిన ప్రాజెక్టులపై ప్రత్యేకంగా సమీక్షిం చారు. ప్రభుత్వ విధానాలకు అనుగుణంగా గ్రోత్ డ్రైవర్స్‌ను గుర్తించి అభివృద్ధి చేస్తే పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు కలుగుతాయన్నారు. మాస్టర్ ప్లాన్ ప్రకారం వచ్చే మూడు నెలల్లో చేపట్టాల్సిన పనులపై శాఖల వారీగా యాక్షన్ ప్లాన్‌లు సిద్ధం చేయాలని ఆదేశించారు. మాస్టర్ ప్లాన్ రోడ్లను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని స్పష్టం చేశారు.విశాఖలో అంతర్జాతీయ ప్రమా ణాలతో కన్వెన్షన్ సెంటర్ నిర్మాణానికి ప్రణాళి కలు రూపొందించాలని, వీఈఆర్ పరిధిలోని సహజ వనరులను సమర్థవంతంగా వినియో గిస్తే విశేష ఫలితాలు సాధ్యమని కలెక్టర్ అన్నా రు. స్టీల్ సిటీ, ఇండస్ట్రియల్ సిటీ, ఫార్మా సిటీ, టూరిజం రంగాల్లో వీఈఆర్‌కు విస్తృత అవకా శాలు ఉన్నాయని పేర్కొన్నారు.ఏజెన్సీ ప్రాంతా లను మిగిలిన ప్రాంతాలతో అనుసంధానం చేయడం, రహదారుల విస్తరణకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. కొనసాగుతున్న మరియు రానున్న రైల్వే ప్రాజెక్టులు, జాతీయ రహదారుల అభివృద్ధిపై ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. రిసార్టులు, హో టళ్ల ఆక్యుపెన్సీ పెరిగేలా చర్యలు తీసుకోవాల న్నారు.శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, ఏఎస్ఆర్, పార్వతీపురం మన్యం, అనకాపల్లి, కాకినాడ, తూర్పుగోదావరి, అంబేద్కర్ కోన సీమ జిల్లాలతో కూడిన ఎకనామిక్ రీజియన్‌పై రాష్ట్ర ముఖ్యమంత్రి ఇటీవల నిర్వహించిన సమీక్ష అంశాలను ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గుర్తు చేశారు. కైలాసగిరి నుంచి భీమిలి వరకు సుమారు 40 చదరపు కిలోమీటర్ల తీర ప్రాంతా న్ని రాష్ట్ర పర్యాటకానికి కోర్ సిటీగా అభివృద్ధి చేయాలని మాస్టర్ ప్లాన్‌లో ప్రతిపాదించారని తెలిపారు.బీచ్ ఫ్రంట్‌లు, వరల్డ్ క్లాస్ థీమ్ పా ర్కులు, వాటర్ స్పోర్ట్స్ హబ్‌లతో విశాఖను అం తర్జాతీయ స్థాయి పర్యాటక కేంద్రంగా తీర్చిది ద్దాలన్నారు. కైలాసగిరి మాస్టర్ ప్లాన్ కింద మెగా రీ-డిజైన్ పనులను త్వరలో ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. సుస్థిర, క్లస్టర్ బేస్డ్ అభివృద్ధికి ప్రతి ప్రాజెక్టుకు కాలపరిమితి నిర్దేశిం చి పని చేయాలని సూచించారు. భోగాపురం ఎయిర్‌పోర్ట్ పూర్తిస్థాయిలో అందుబాటులోకి వచ్చేలోగా మాస్టర్ ప్లాన్ రోడ్లను పూర్తి చేయా లని, మౌలిక వసతుల కల్పనపై ప్రధాన దృష్టి సారించాలని తెలిపారు.

ఈ సమావేశంలో ఆర్డీవోలు సుధాసాగర్, సంగీ త్ మాధుర్, వీఎంఆర్డీఏ, జీవీఎంసీ, మెట్రో, ఏపీ ఐఐసీ, పరిశ్రమలు, టూరిజం, ఆర్ & బి తది తర శాఖల అధికారులు, పలువురు తహశీ ల్దార్లు పాల్గొన్నారు.




## కార్యకర్త కుటుంబానికి వాసుపల్లి భరోసా రూ.5 వేల ఆర్థిక సాయం

**విశాఖ దక్షిణం, పెన్ పవర్, జనవరి 05 :**దక్షిణ నియోజకవర్గంలో పేదల ఆపద్బాంధవు డిగా గుర్తింపు పొందిన మాజీ ఎమ్మెల్యే, దక్షిణ నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్ కుమార్ మరోసారి మానవత్వాన్ని చాటుకున్నా రు. 39వ వార్డు శ్రీహర్ష జంక్షన్ సమీపంలో నివ సిస్తున్న వైసీపీ సీనియర్ కార్యకర్త మహమ్మద్ మెహబూబ్ బేగం అకాల మరణంతో ఆమె కు టుంబాన్ని వాసుపల్లి గణేష్ కుమార్ పరామ ర్శించారు.మరణించిన మెహబూబ్ బేగం భర్త సలీంను కలిసి ధైర్యం చెప్పిన ఆయన, సొంత నిధుల నుంచి రూ.5,000 ఆర్థిక సహాయం అం దజేశారు. పార్టీ శ్రేణులు, ప్రజలు కష్టాల్లో ఉన్న ప్పుడు తాను ఎప్పుడూ అండగా ఉంటానని ఈ సందర్భంగా వాసుపల్లి భరోసా ఇచ్చారు. మెహ బూబ్ బేగం మరణం పార్టీకి తీరని లోటని పేర్కొ న్న ఆయన, ఆమె పార్టీ కార్యక్రమాల్లో ఉత్సా హంగా పాల్గొంటూ సేవలందించారని గుర్తు చేశా రు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షి స్తూ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.



ఈ కార్యక్రమంలో 39వ వార్డు అధ్యక్షుడు ముజీఫ్ ఖాన్, కార్పొరేటర్ చెన్నా జానకిరామ్, జిల్లా వైస్ ప్రెసిడెంట్ డేవిడ్ రాజు, సౌత్ మైనా రిటీ సెల్ ప్రెసిడెంట్ బాబ్జి, వెంకటి, చేపల అప్పారావు, సౌత్ ఎస్సీ సెల్ ప్రెసిడెంట్ ఆకుల శ్యామ్, అదిలక్ష్మి, చేపల ప్రసాద్, తిట్టి కృష్ణ, మాలతి, ఈశ్వరి, ఆరుగుల రాజు, అప్పలరాజు, కాసుబాబు తదితర సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# భూ సమస్యల్లో దళారుల జోక్యం సహించేది లేదు



**జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ హెచ్చరిక**

**రెవెన్యూ క్లినిక్‌లో అధికారులకు కఠిన ఆదేశాలు**

**అక్కడికక్కడే భూ సమస్యల పరిష్కారానికి సూచన**

**పీజీఆర్ఎస్‌కు 207, రెవెన్యూ క్లినిక్‌కు 137 వినతులు**

**విశాఖ దక్షిణం, పెన్ పవర్, జనవరి 05 :**భూ సమస్యల పరిష్కారంలో దళారుల ప్రమే యం ఏమాత్రం సహించబోమని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ స్పష్టంచేశారు. అధికారిక కార్యాచరణలో ఇతరుల జోక్యం ఉంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. దళారులు లేదా రాజకీయ నాయకులు సూచిం చినప్పుడే అర్జీలు రిజిస్టర్ చేస్తామనే ధోరణి ఏ అధికారిలోనైనా కనిపిస్తే సస్పెన్షన్‌కు కూడా వెనుకాడబోమని ఆయన తేల్చి చెప్పారు.

సోమవారం కలెక్టరేట్ వీసీ హాలులో నిర్వహిం చిన రెవెన్యూ క్లినిక్‌లో జాయింట్ కలెక్టర్ కె. మయూర్ అశోక్‌తో కలిసి పాల్గొన్న కలెక్టర్, తహసీల్దార్లు మరియు డివిజన్ స్థాయి రెవెన్యూ అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. భూములకు సంబంధించిన సమస్యలను వీలై నంతవరకు రెవెన్యూ క్లినిక్‌లోనే పరిష్కరించాల ని, ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పకూడ దని, ఉద్దేశపూర్వకంగా జాప్యం చేయరాదని సూచించారు.ప్రతి వినతిని సానుకూలంగా స్వీకరించి పూర్తిస్థాయిలో పరిశీలించి న్యాయ మైన పరిష్కారం అందించాలని ఆదేశించారు. డాక్యుమెంట్లు లేవని అర్జీలను తిరస్కరించరా దని, కనీసం సర్వే నంబర్ ఉన్నా తప్పనిసరిగా అర్జీ రిజిస్టర్ చేయాలని డిజిటల్ అసిస్టెంట్లకు స్పష్టం చేశారు. భూ సమస్యలు ఎక్కువగా ఉన్న ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు.జాయింట్ కలెక్టర్ ఆధ్వర్యంలో కొనసాగిన రెవెన్యూ క్లినిక్‌లో విశాఖపట్నం, భీమిలి ఆర్డీవోలు సుధాసాగర్, సంగీత్ మాధుర్‌తో పాటు అన్ని మండలాల తహసీల్దార్లు ప్రజల నుంచి వినతులు స్వీకరిం చారు. ప్రజలను కూర్చోబెట్టి సమస్యలను శ్రద్ధగా విని, అక్కడికక్కడే విచారణ జరిపి పరిష్కార చర్యలను వివరించారు. సర్వే, 22-ఏ జాబితా నుంచి తొలగింపు, భూముల క్రమబ ద్ధీకరణ, మ్యుటేషన్ తదితర అంశాలపై మొత్తం 137 వినతులు రెవెన్యూ క్లినిక్‌లో అందాయి. సాధారణ పీజీఆర్ఎస్‌కు 207 వినతులు అదే రోజు కలెక్టరేట్ మీటింగ్ హాలులో నిర్వహించిన సాధారణ పీజీఆర్ఎ స్‌లో వివిధ సమస్యలపై ప్రజలు 207 వినతులు సమర్పించారు. వీటిలో జీవీఎంసీకి సంబంధిం చినవి 90, పోలీస్ విభాగానికి చెందినవి 21, ఇతర శాఖలకు చెందినవి 96 ఉన్నాయి. జిల్లా కలెక్టర్‌తో పాటు పీజీఆర్ఎస్ నోడల్ అధికారి శేష శైలజ, జీవీఎంసీ ఏడీసీ సత్యవేణి వినతులు స్వీకరించారు. అన్ని శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొని సంబంధిత వినతులపై పరిష్కార చర్యలు చేపట్టారు.

## మౌలిక సదుపాయాల పై జెడ్సీకి వినత పత్రం అందజేత



**గాజువాక : పెన్ పవర్,జనవరి05:**జీవీఎంసీ అగనంపూడి జోనల్ కార్యాలయంలో మొదటి గ్రీవెన్స్ లో భాగంగా 85వ వార్డు తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు కర్రి దశేంద్ర 85వ వార్డులో ఉన్నటువంటి, రోడ్లు, డ్రైనేజీ వాటర్ , ఎలక్ట్రికల్, క్రీడాస్థలాలు అభివృద్ధి, ఖాళీ స్థలాలు రక్షణ,మౌలిక వసతుల కల్పన పలు సమస్యల పైన వినతి పత్రం అగనంపూడి జోనల్ కమిషనర్ మనిషా త్రిపాఠి కి అందజేశారు .అగనంపూడి ప్రాంతాన్ని వేగంగా అభివృద్ధి చేయాలని, గ్రీవెన్స్ లో ఎటువంటి సమస్యలు వచ్చినా వెంటనే పరిష్కరించాలని తెలపడం జరిగింది. జోనల్ కమిషనర్ సానుకూలంగా స్పందించి సంబంధించిన అధికారులకు ఆదేశాలు జారీ చేయడం జరిగిందన్నారు .ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకుడు గంతకోరు అప్పారావు, ప్రధాన కార్యదర్శి విందుల రాజు, గజ్జల నూకరాజు, జాజుల తాతారావు, తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధికి మరింత చేయూత.. వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్గార్ అండ్ ఆజీవిక మిషన్......

* తాండవ ప్రాజెక్ట్ చైర్మన్ కరక సత్యనారాయణ......



**నాతవరం,పెన్ పవర్ (జనవరి 05)** గ్రామీణ పేదల ఉపాదికి మరింత చేయూత గా వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్గార్ అండ్ ఆజీవికా మిషన్ నిలుస్తుందని తాండవ ప్రాజెక్ట్ చైర్మన్ కరక సత్యనారాయణ అన్నారు.సోమవారం మండలంలో గల 31 పంచాయతీలలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం స్థానంలో విబిజి రామ్ జి చట్టం కొత్తగా అమల్లోకి రానున్న విషయం ప్రజలకు అవగాహన కల్పించేందుకు గ్రామ సభలు నిర్వహించారు. దీనిలో భాగంగా వైడిపేట పంచాయతీ మర్రిపాలెం గ్రామంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా తాండవ చైర్మన్ కరక సత్యనారాయణ మాట్లాడుతూ వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్గార్ అండ్ ఆజీవిక మిషన్ ద్వారా ఉపాధి హామీ కూలీలకు 100 రోజులు పనికి బదులుగా 125 రోజులు పని కల్పించడం ద్వారా అదనపు ఆదాయం చేకూరుతుందని ఆయన అన్నారు.అంతేకాకుండా గ్రామీణ కుటుంబాలకు ఆర్థిక భద్రత కల్పించడం జరుగుతుందని తెలియజేశారు. అదేవిధంగా మహిళలకు నైపుణ్య శిక్షణ, స్వయం ఉపాధి, వ్యవస్థాపకతకు ఉత్సాహం వంటి కొత్త అవకాశాలు కలుగుతాయని ఆయన అన్నారు.అనంతరం నిర్వహించిన పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా వెన్నెల పాలెం గ్రామంలో సిసి రోడ్డు నిర్మాణం,మర్రిపాలెం లో సిసి రోడ్ కం సైడ్ డ్రైన్ ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి ఎం.సత్య శ్రీనివాస్,జనసేన నర్సీపట్నం నియోజకవర్గ ఇన్చార్జ్ సూర్య చంద్ర,మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నందిపల్లి వెంకటరమణ,బిజెపి నాయకులు గవిరెడ్డి త్రినాథ్,డిప్యూటీ ఎంపీడీవో కే.మూర్తి బాబు,ఏపీవో దాసరి కొండాజి,పిఆర్ జె ఈ వెంకటేశ్వరమ్మ,ఏపిఎం కనకరాజు,ఎంపీటీసీ పి సత్యవేణి,మాజీ సర్పంచ్ అల్లు సోమనాయుడు,రంభ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## జనతా వారధిలో ముంచంగిపుట్టు మండల సమస్యలు

బిజెపి మండల అధ్యక్షులు సుబ్బారావు.



**ముంచంగిపుట్టు, పెన్ పవర్, జనవరి 05.** అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు కేంద్రంలో సోమవారం ఎచ్చర్ల నియోజకవర్గం శాసనసభ్యులు ఎన్ ఈశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజలకు ప్రభుత్వానికి వారధి బిజెపి జనతా వారధి కార్యక్రమం కు ముంచంగిపుట్టు మండల బిజెపి అధ్యక్షుడు సుబ్బారావు మాజీ మండల అధ్యక్షులు వి లక్ష్మణరావు పార్టీ నాయకులు ఆర్ నాగార్జున ఎమ్మెల్యే ఎన్ ఈశ్వర్ రావు కు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతినెల పాడేరు కేంద్రంగా జనతా వారధి కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని, ముంచంగిపుట్టు మండల సమస్యలతో పాటు మండల కేంద్రంలో డ్రైనేజీ సిసి రోడ్డు నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే వినతి పత్రం అందజేశామని వారు అన్నారు. అలాగే గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాల 1 నుండి నాలుగు రోడ్ల కూడలి వరకు డ్రైనేజి నిర్మాణం, అలాగే దుర్గ గుడి సమీపము నుండి హోలీ గ్రౌండ్ వెళ్ళుటకు సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టాలని ఎమ్మెల్యే ఈశ్వరరావు కోరామని వారు తెలిపారు.

మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజల సమస్యలపై ఎమ్మెల్యేకు వివరించామన్నారు. దీనిపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి మండల సమస్య పరిష్కారం కోసం అలాగే డ్రానేజీ సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారని సుబ్బారావు లక్ష్మణరావు తెలిపారు.

# మీది విధ్వంసం మాది వికాసం, భోగాపురం ఎయిర్ పోర్టు వాస్తవాలు వెల్లడించిన రాష్ట్ర గిరిజన సహకార సంస్థ చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్



**పాడేరు, పెన్ పవర్, జనవరి 5:**
అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు కేంద్రంలో ఉన్న తన క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర గిరిజన సహకార సంస్థ చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్ విలేకర్లతో మాట్లాడుతూ, భోగాపురం ఎయిర్ పోర్టు నిర్మాణానికి సంబంధించిన వాస్తవాలను స్పష్టంగా వెల్లడించారు.

భోగాపురం ఎయిర్ పోర్టు నిర్మాణానికి ఆలోచన మొదలు, అనుమతులు, శంకుస్థాపన వరకు పూర్తిగా తెలుగుదేశం పార్టీ ప్రభుత్వమే కృషి చేసిందని, ఆ తర్వాత ఐదేళ్ల విరామం అనంతరం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం నిర్మాణ పనులను వేగవంతం చేసి దాదాపు 95 శాతం మేర పూర్తి చేసిందని ఆయన తెలిపారు.

201419 మధ్యకాలంలోనే అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు భోగాపురం ఎయిర్ పోర్టుకు శంకుస్థాపన చేసి, 2502 ఎకరాల భూమి సేకరణతో పాటు అవసరమైన అనుమతులను అప్పుడే సాధించారన్నారు. అనంతరం అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఈ ప్రాజెక్టుపై అనేక అడ్డంకులు సృష్టించిందని విమర్శించారు.

2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే భోగాపురం ఎయిర్ పోర్టు పనులకు తిరిగి ఊపొచ్చిందని, భూ వివాదాల పరిష్కారం, కేంద్ర ప్రభుత్వ అనుమతులు, జ×ాఖీ భద్రత, కస్టమ్స్, ఇమ్మిగ్రేషన్ చెక్‌పోస్ట్ (×జ్రూ) హోదా వంటి కీలక అంశాలు సాధ్యమయ్యాయని పేర్కొన్నారు. 2026 జనవరి 4న భోగాపురం ఎయిర్ పోర్టులో తొలి విమానం ల్యాండ్ కావడం ఉత్తరాంధ్ర ప్రజలకు గర్వకారణమని, మరో ఐదారు నెలల్లో అధికారిక ప్రారంభోత్సవం జరగనుందని వెల్లడించారు.

భోగాపురం ఎయిర్ పోర్టు నిర్మాణం తమ వల్లేనని వైసీపీ నేతలు చేస్తున్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని కిడారి శ్రావణ్ కుమార్ అన్నారు. ఒకప్పుడు "భోగాపురానికి ఎయిర్ పోర్టు ఎందుకు?", "కోర్టులకు వెళ్లి ఆపేస్తాం" అంటూ వ్యాఖ్యలు చేసిన వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి మాటలను ఉత్తరాంధ్ర ప్రజలు మరిచిపోలేదన్నారు.

కూటమి ప్రభుత్వం నిరంతరం కొనసాగి ఉంటే ఇప్పటికే భోగాపురం నుంచి పెద్ద సంఖ్యలో విమానాల రాకపోకలు జరిగేవని, విశాఖ కేంద్రంగా బలమైన ఎకో సిస్టం ఏర్పడి, సర్వీస్ సెక్టార్ విస్తరించి, రాష్ట్ర ఆదాయం మరింత పెరిగేదని తెలిపారు.

భోగాపురాన్ని అంతర్జాతీయ ఏవియేషన్ హబ్‌గా తీర్చిదిద్దాలన్న స్పష్టమైన విజన్‌తోనే ఈ ప్రాజెక్టు రూపకల్పన జరిగిందని, వీ=ా, లాజిస్టిక్స్, తయారీ, స్కిల్లింగ్ పరిశ్రమలతో కూడిన అభివృద్ధి కేంద్రంగా ఇది మారబోతోందని ఆయన పేర్కొన్నారు.

ఈ కీలక ప్రాజెక్టు ముందుకు సాగడంలో సహకరించిన ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర మంత్రి నారా లోకేష్ లకు కిడారి శ్రావణ్ కుమార్ ధన్యవాదాలు తెలిపారు.

భోగాపురం ఎయిర్ పోర్టు ఉత్తరాంధ్ర వికాసానికి మైలురాయిగా నిలవబోతోందని, ఇది కూటమి ప్రభుత్వ వికాస దృక్పథానికి స్పష్టమైన నిదర్శనమని ఆయన వ్యాఖ్యానించారు.

ఈ కార్యక్రమంలో దారెలా పాండు రంగ స్వామి,"ావీజ వైస్ చైర్మన్ జ్ఞానా ప్రకాష్, ఎస్టీ సెల్ కార్యదర్శి సుబ్బారావు, టీడీపీ నాయకులు త్రినాథ్, మల్లేష్, మురళి, అచ్చిబాబు తదితరులు పాల్గొన్నారు.

## పలువూరు కార్యకర్తల కుటుంబాలను పరామర్శించిన రాష్ట్ర గిరిజన సహకార సంస్థ చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్



**పాడేరు, పెన్ పవర్, జనవరి 5:**అల్లూరి సీతారామరాజు జిల్లా హుకుంపేట మండలం సంతరి పంచాయతీ బూరుగుపూట్ గ్రామంలో హెడ్ కానిస్టేబుల్ కూడేలి వెంకటరమణ అనారోగ్యంతో ఇటీవల స్వర్గస్తులైన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా వారి సతీమణి కూడేలి కాంతమ్మను రాష్ట్ర జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్ పరామర్శించి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కష్ట సమయంలో ధైర్యంగా ఉండాలని, పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఏ సమస్య ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు.

అలాగే సంతరి గ్రామానికి చెందిన మాజీ కోఆపరేటివ్ డైరెక్టర్ టమికే నూకరాజు అనారోగ్యంతో బాధపడుతున్నారని తెలుసుకుని, ఆయనను పరామర్శించారు. వైద్యుల సూచనలు తప్పనిసరిగా పాటించాలని, ధైర్యంగా ఉండాలని, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

అనంతరం కొట్నాపల్లి పంచాయతీ మత్యపురం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ కొర్ర రాంబాబు అనారోగ్యంతో ఇటీవల స్వర్గస్తులైన నేపథ్యంలో, వారి కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి, సంతాపం తెలిపారు. కుటుంబానికి ఎలాంటి సమస్యలు వచ్చినా పార్టీ అండగా ఉంటుందని రాష్ట్ర జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్ భరోసా ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో బాకూరు సర్పంచ్ బాకూరు వెంకటరమణ రాజు, మాజీ జడ్పీటీసీ సాగర సుబ్బారావు, దారెలా సర్పంచ్ పాంగి పాండురంగ స్వామి, గూడ సర్పంచ్ కంబిడి జ్ఞానప్రకాష్, మాజీ సర్పంచ్ కొర్ర వాసుదేవరావు, అసెంబ్లీ తెలుగు యువత ఆర్గనైజేషన్ సెక్రటరీ, మండల పీసా కమిటీ అధ్యక్షులు చప్పాలి శంకర్ రావు, పీసా కమిటీ ఉపాధ్యక్షులు జన్ని వెంకటరమణ, క్లస్టర్ ఇంచార్జి కూడేలి నూకరాజు, టీడీపీ యువ నాయకులు కర్జా అచ్చిబాబు, త్రినాథ్, మురళీ రాజు తదితరులు పాల్గొన్నారు.

## మినీ గురుకులంలో అక్రమ డిప్యూటేషన్లు. విద్యార్థుల జీవితాల తో చెలగాటం

ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు: కృష్ణ



**పాడేరు , పెన్ పవర్, జనవరి 5:** పెదబయలు మండలం గోమంగి మినీ గురుకులం, మరియు ఆశ్రమ పాఠశాలలలో అక్రమ అక్రమ డిప్యూటేషన్లు రద్దు చేయాలని, ఇటీవల అధికారులకు ఫిర్యాదు చేయడం జరిగింది. అధికారులకు, అనేక మార్లు విన్నవించిన ప్రయోజనం లేదని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు కృష్ణ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. వారు మాట్లాడుతూ: కొంతమంది ఉపాధ్యాయులు విద్యార్థులకు పాఠాలు బోధించకుండా, విద్యార్థులు సక్రమంగా మెనూ, విద్యార్థుల బాగోగులు చూసుకోకుండా, వార్డెన్, మరియు ఎస్ఓ, ప్రిన్సిపాల్ పోస్టులకు అదే పరమ వాదిగా ఎంచుకొని, కొంతమంది పెదబయలు మండలం గోమంగి మినీ గురుకులం లాంటి స్కూల్స్ ని ఎంచుకొని మాకు ఎవరు అడిగేది అన్న పద్ధతిలో కొంతమంది. అధికారులతో కుమ్మక్కై అధికారులకు ప్రలోభాలు చూపించి, అక్రమ డిప్యూటేషన్లు వేయించుకొని విద్యార్థుల జీవితాలు నాశనం చేస్తున్నారని, ఇలాంటి వాటిపై తక్షణమే జిల్లా కలెక్టర్ గారు, మరియు పాడేరు ఐటీడీఏ పిఓ గారు స్పందించి అక్రమ డిప్యూటేషన్లు వేస్తున్న అధికారులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని వారు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

అదేవిధంగా గురుకులాలలో పనిచేస్తున్నటువంటి ఉపాధ్యాయులనే మినీ గురుకుల పాఠశాలలకు ప్రిన్సిపాల్ గా నియమించాలని లేనిపక్షంలో అక్రమ డిప్యూటేషన్లపై పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని వారు అన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారంలో వేగం పెంచిన అనకాపల్లి జిల్లా పోలీసులు



* ప్రజా ఫిర్యాదుల వేదికలో 47 ఫిర్యాదుల స్వీకరణ
* 7 రోజుల్లో పరిష్కారానికి అదనపు ఎస్పీ ఆదేశాలు

**అనకాపల్లి, పెన్ పవర్, జనవరి 5 :** ప్రజల సమస్యలకు త్వరితగతిన పరిష్కారం అందించాలనే లక్ష్యంతో అనకాపల్లి జిల్లా పోలీసు శాఖ నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమం సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జరిగింది. జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశాల మేరకు ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ శ్రీ ఎం. దేవ ప్రసాద్ పాల్గొని ప్రజల నుంచి మొత్తం 47 ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా స్వీకరించిన ఫిర్యాదుల్లో ఎక్కువగా భూ తగాదాలకు సంబంధించినవే ఉండగా, వాటి సంఖ్య 22గా ఉంది. అదేవిధంగా కుటుంబ కలహాలు 3, మోసపూరిత వ్యవహారాలు 2, కాగా ఇతర శాఖలకు సంబంధించిన ఫిర్యాదులు 20గా నమోదయ్యాయి.

ఫిర్యాదు దారులతో అదనపు ఎస్పీ ఎం.దేవ ప్రసాద్ వ్యక్తిగతంగా మాట్లాడి వారి సమస్యలను శ్రద్ధగా విని, సంబంధిత అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. "ప్రతి ఫిర్యాదును నిష్పక్షపాతంగా పరిశీలించి వాస్తవాలను నిర్ధారించాలి. 7 రోజుల్లోపు విచారణ పూర్తిచేసి తగిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలి. చేపట్టిన చర్యలపై నివేదికలను తప్పనిసరిగా జిల్లా పోలీసు కార్యాలయానికి సమర్పించాలని ఆయన అధికారులను ఆదేశించారు. అలాగే ప్రజలకు వేగవంతమైన న్యాయం అందించడమే పోలీసుల ప్రధాన బాధ్యతని పేర్కొన్న అదనపు ఎస్పీ ప్రజా సమస్యలను చట్టబద్ధంగా, పారదర్శకంగా పరిష్కరించడంలో అనకాపల్లి జిల్లా పోలీసులు ఎల్లప్పుడూ కట్టుబడి ఉన్నారు.

ప్రజలు ఎలాంటి సందేహం లేకుండా తమ సమస్యలను పోలీసు శాఖ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. ఈ ప్రజా ఫిర్యాదుల వేదిక కార్యక్రమంలో వివిధ విభాగాలకు చెందిన పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొని ఫిర్యాదుల నమోదు ప్రక్రియను పర్యవేక్షించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో పోలీసు శాఖ తీసుకుంటున్న ఈ చర్యలపై ఫిర్యాదు దారులు సంతృప్తి వ్యక్తం చేశారు.

# రోడ్డు వైండింగ్ కారణంగా ఇళ్ల నష్టం

**బాధితులకు జీవీఎంసీ పరిహారం పంపిణీ**

**విశాఖ పశ్చిమ, పెన్ పవర్, జనవరి 5 :**
విశాఖపట్నం నగర పరిధిలోని ఎన్ఏడి కొత్త రోడ్ నుంచి ఎన్ఎస్‌టీఎల్ రోడ్డు, లక్ష్మీనగర్, ఇందిరానగర్ కొండవాలు ప్రాంతం నుంచి సింహాచలం వైపు వెళ్లే రహదారి వైండింగ్ పనుల కారణంగా తీవ్ర ప్రభావం చోటు చేసుకుంది. ఈ రోడ్డు అభివృద్ధి పనుల నేపథ్యంలో సుమారు 90 మంది నివాసితుల ఇళ్లు పాక్షికంగా, మరికొన్ని పూర్తిగా ధ్వంసం కావడం జరిగింది. ఈ ఘటనలో నష్టపోయిన బాధిత కుటుంబాలకు గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ (జీవీఎంసీ) ఆధ్వర్యంలో సుమారు రూ.92 లక్షల నష్టపరిహార చెక్కులను అందజేశారు. ఈ పరిహారాన్ని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గణబాబు స్వయంగా బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా గణబాబు మాట్లాడుతూ, రోడ్డు అభివృద్ధి ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని చేపట్టినప్పటికీ, దాని వల్ల ఇబ్బందులు ఎదుర్కొన్న ప్రజలకు ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు.

బాధితులకు తక్షణమే పరిహారం అందేలా చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. భవిష్యత్తులో కూడా అవసరమైన సహాయాన్ని ప్రభుత్వం అందిస్తుందని భరోసా ఇచ్చారు. పరిహారం అందుకున్న బాధితులు ఈ సందర్భంగా సంతోషం వ్యక్తం చేస్తూ గణబాబుకి కృతజ్ఞతలు తెలియజేశారు. తమ సమస్యను ప్రభుత్వం గుర్తించి న్యాయం చేసినందుకు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వెస్ట్ జోనల్ కమిషనర్ రాము, ఏసీపీ రామలింగారెడ్డి, కూటమి నేతలు నారిపిన్ని సత్తిరాజు, శరగడం అరుణ్ కుమార్, అలాగే టీపిఓ గోపన్న, రెవెన్యూ అధికారి లీల



తదితర అధికారులు, నాయకులు పాల్గొన్నారు. అధికారులు పరిస్థితిని సమీక్షిస్తూ, మిగిలిన సమస్యల పరిష్కారానికి కూడా తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# సంక్రాంతి పండగ నేపథ్యంలో నేర నియంత్రణపై పోలీసుల ప్రత్యేక చర్యలు

- సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి
- పోలీసులకు ముందస్తు సమాచారం ఇవ్వాలి



**విశాఖ పశ్చిమ, పెన్ పవర్, జనవరి 5 :** గ్రేటర్ విశాఖ నగరంలో సంక్రాంతి పండగను పురస్కరించుకొని గ్రామాలకు వెళ్లే ప్రజలు తమ ఇళ్ల భద్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని నగర పోలీస్ కమిషనర్ డా.శంఖబ్రత బాగ్చి సూచించారు. ఆయన ఆదేశాల మేరకు క్రైమ్ డీసీపీ లతా మాధురి నేతృత్వంలో వెస్ట్ జోన్ పరిధిలో నేర నియంత్రణ చర్యలు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. ఈ సందర్భంగా వెస్ట్ క్రైమ్ సీఐ చంద్రమౌళి మాట్లాడుతూ పండగ సమయంలో చాలా మంది తాళాలు వేసి ఊర్లకు వెళ్లడం వల్ల దొంగతనాల ముప్పు పెరుగుతుందని తెలిపారు. దీనిని దృష్టిలో పెట్టుకొని ప్రజలు తమ విలువైన ఆభరణాలు, నగదు వంటి వస్తువులను సురక్షితంగా ఉంచుకోవాలని సూచించారు. ముఖ్యంగా ఇళ్ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటే రాత్రి, పగటి వేళల్లో జరిగే దొంగతనాలను అరికట్టవచ్చని అన్నారు.

అలాగే ఊర్లకు వెళ్లే ముందు తమ ప్రాంత పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇస్తే, ఆయా ప్రాంతాల్లో నైట్ గస్తీ మరింత కట్టుదిట్టంగా నిర్వహిస్తామని తెలిపారు. ప్రజలు పోలీసులకు సహకరించడం ద్వారా నేరాలను సమర్థవంతంగా నియంత్రించవచ్చని పేర్కొన్నారు. ఈ అవగాహన కార్యక్రమంలో కంచరపాలెం, ఎయిర్‌పోర్ట్, గోపాలపట్నం, పెందుర్తి ప్రాంతాల క్రైమ్ ఎస్సైలు పాల్గొన్నారు. కంచరపాలెం క్రైమ్ ఎస్సై మరుఫ్, ఎయిర్‌పోర్ట్ ఎస్సై రవికిరణ్, గోపాలపట్నం ఎస్సై తేజేశ్వరరావు, పెందుర్తి ఎస్సై సూరిబాబు తదితరులు ప్రజలకు భద్రతపై సూచనలు అందించారు. పండగ వాతావరణంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు అన్ని విధాలా అప్రమత్తంగా ఉన్నారని, ప్రజలు కూడా జాగ్రత్తలు పాటించాలని విశాఖ నగర పోలీసులు కోరారు.

## సర్పంచ్ సిరిబాల బుజ్జి బాబు ఆధ్వర్యంలో గ్రామసభ సమస్యల పరిష్కారానికి హామీ



**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, జనవరి 5:** అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్త వీధి మండలం దేవరపల్లి పంచాయితీ కేంద్రంలో గ్రామ సర్పంచ్ సిరిబాల బుజ్జి బాబు ఆధ్వర్యంలో గ్రామసభను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ పంచాయతీలో ఉన్న సమస్యలను గ్రామాల వారిగా గుర్తించి దశలవారీగా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ప్రజల అవసరాలు, సమస్యలపై అవగాహన కల్పిస్తూ త్వరితగతిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఈ గ్రామసభలో భాగంగా పట్టాల పంపిణీ కార్యక్రమాన్ని కూడా నిర్వహించారు. స్థానిక విఆర్ఓ, కూటమి నాయకుల చేతుల మీదుగా అర్హులైన లబ్ధిదారులకు పట్టాలను అందజేశారు.ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు కాకూరు శేఖర్, తెలుగుదేశం పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షులు లకే రామారావు, మండల ఉపాధ్యక్షులు పాడి శ్రీనివాసరావు, స్థానిక సెక్రటరీ స్వామి నాయుడు, స్థానిక విఆర్ఓ గడుతురి భారతి, పీసా సెక్రటరీ రామలింగం, కూటమి నాయకులు మరియు గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.గ్రామ అభివృద్ధికి అందరూ కలిసి కృషి చేయాలని నాయకులు ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

## సర్పంచ్ కాసులమ్మ అధ్యక్షతన గ్రామసభ



**గూడెం కొత్త వీధి,పెన్ పవర్,జనవరి 5:**అల్లూరి సీతారామరాజు జిల్లా, గూడెం కొత్తవీధి మండలం వంచుల పంచాయతీ కేంద్రంలో స్థానిక సర్పంచ్ వనపల కాసులమ్మ అధ్యక్షతన గ్రామసభను నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీలో అమలవుతున్న ఎస్‌డబ్ల్యూపీసీ నిర్వహణ, పారిశుద్ధ్యంపై విస్తృతంగా చర్చించారు. గ్రామంలో పరిశుభ్రతను మరింత మెరుగుపర్చేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులు, ప్రజాప్రతినిధులు సూచనలు చేశారు.సర్పంచ్ కాసులమ్మ మాట్లాడుతూ గ్రామ అభివృద్ధిలో ప్రతి ఒక్కరి భాగస్వామ్యం అవసరమని, ముఖ్యంగా పారిశుద్ధ్యం విషయంలో ప్రజలు సహకరించాలని కోరారు. సమస్యలను గుర్తించి దశలవారీగా పరిష్కరిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో వైస్ సర్పంచ్ శ్రీధర్, వార్డు సభ్యులు కోర్ర రఘునాథ్, వంతల చిలకమ్మ, పొత్తూరు సోములమ్మ, పీసా సభ్యులు, వైఎస్సార్‌సీపీ నాయకులు వనపల రాజేష్, లొంజ గణపతి, బూడిద జానకిరామ్,చిట్టిబాబు, సుదర్శన్, బంగారు రాజ్, కూటమి నాయకులు మధు, అజిత్, కోటి, ఈశ్వరరావు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, పంచాయతీ సిబ్బంది మరియు వివిధ గ్రామాల నుంచి వచ్చిన గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## గబ్బంగిలో ఘనంగా 42 పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ. ఆర్డిఓ ఎంబీఎస్ లోకేశ్వరరావు.



**పాడేరు, పెన్ పవర్,జనవరి : 05** :అల్లూరి జిల్లా, పాడేరు మండలం,గబ్బంగి పంచాయతీ పరిధిలోని గబ్బంగి, దాలిపుట్టు రెవెన్యూ గ్రామాల రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలను ఇన్చార్జ్ ఆర్డిఓ, పంపిణీ చేశారు. సోమవారం ఉదయం స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో రెవెన్యూ డివిజనల్ అధికారి పాల్గొని గ్రామంలోని 42 మంది రైతులకు రీ సర్వే పట్టాదార్ పాస్ బుక్స్ రాజముద్రతో కూడిన పాస్ పుస్తకాలను ప్రజా ప్రతినిధులతో కలిసి పంపిణీ చేయడం జరిగిందని అన్నారు. ఈ పంపిణీలో భాగంగామొత్తం 42 మంది లబ్ధిదారులకు కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలను అందజేశామని,దాలిపుట్టు రెవెన్యూ గ్రామానికి చెందిన రైతులకు వారి భూమి హక్కులను ధృవీకరిస్తూ ఈ పత్రాలను పంపిణీ చేయడం జరిగిందన్నారు.

ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, రైతులు తమ భూమి హక్కుల విషయంలో ఎటువంటి ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం పారదర్శకంగా ఈ పుస్తకాలను అందజేస్తుందని తెలిపారు. పాస్ పుస్తకాలు అందుకున్న రైతులు ఇందుకు సంబంధించిన అభ్యంతరాలు ఏమున్నా తెలియజేయాలని కోరారు. పట్టలు పొందిన రైతులు తమ సంతోషాన్ని వ్యక్తం చేస్తూ, ఇది ప్రభుత్వ పథకాలు మరియు బ్యాంకు రుణాల పొందేందుకు ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. పట్టాలు పొందిన రైతులకు ప్రభుత్వం నుండి ఫోన్ కాల్ వచ్చినప్పుడు వారి అడిగిన సమాధానానికి సంతోషంగా ఉన్నట్లయితే ఒకటి నొక్కండి అభ్యంతరం ఏమైనా ఉన్నట్లయితే రెండు నొక్కండి చెప్పినప్పుడు మీరు 1గాని 2గాని నొక్కండి. ఏది నొక్కకుండా ఉన్నట్లయితే మీకు ఇంకాను ప్రభుత్వం నుండి ఎటువంటి లబ్ధి అందలేదన్న భావం ఉంటుందని అందుకు తగిన సమాచారం ప్రభుత్వానికి అందించాలని అన్నారు.

ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, రాష్ట్ర తెలుగు యువజన కార్యదర్శి సురేష్, మండల తహసిల్దార్, డిప్యూటీ తాసిల్దార్, రెవెన్యూ ఇన్స్పెక్టర్, విలేజ్ రెవెన్యూ ఆఫీసర్ (వీఆర్వో), పంచాయతీ కార్యదర్శి, గ్రామస్తులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## కార్పొరేటర్ వెంకట రమేష్‌కు బ్రహ్మకుమారిస్ ప్రతినిధుల ఘన సన్మానం



**విశాఖ పశ్చిమ, పెన్ పవర్, జనవరి 5 :** జీవీఎంసీ 89వ వార్డు, నాగేంద్ర కాలనీలోని ప్రజాపిత బ్రహ్మకుమారిస్ ఈశ్వరియ విశ్వ విద్యాలయం ఆధ్వర్యంలో నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని శుభాకాంక్షల కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డు కార్పొరేటర్, స్టాండింగ్ కమిటీ సభ్యులు దాడి వెంకట రమేష్ ని బ్రహ్మకుమారిస్ ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా బ్రహ్మకుమారిస్ ఈశ్వరియ విశ్వ విద్యాలయం వారు రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను కార్పొరేటర్ దాడి వెంకట రమేష్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఆధ్యాత్మిక విలువలు, సానుకూల ఆలోచనలతో సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం పెంపొందించాలనే లక్ష్యంతో బ్రహ్మకుమారిస్ సంస్థ చేస్తున్న సేవలు అభినందనీయమని ఈ సందర్భంగా కార్పొరేటర్ తెలిపారు. నూతన సంవత్సరం ప్రజలందరికీ ఆరోగ్యం, శాంతి, అభివృద్ధిని తీసుకురావాలని ఆయన ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో 89 మరియు 92వ వార్డుల క్లస్టర్ ఇంచార్జ్ దాడి సురేష్ పాల్గొని మాట్లాడుతూ, బ్రహ్మకుమారిస్ సంస్థ సామాజిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రజలకు మంచి మార్గదర్శకంగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. అలాగే టీడీపీ నాయకులు శిలపర శెట్టి శ్రీనివాస్, బత్తుల శ్రీనివాస్, ఆళ్ల ఆదిబాబు, తలబత్తుల నాగరాజు పాల్గొని కార్పొరేటర్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

బ్రహ్మకుమారీస్ సంఘ సభ్యులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఆధ్యాత్మికతతో పాటు సామాజిక బాధ్యతను మేళవిస్తూ ఇలాంటి కార్యక్రమాలు మరిన్ని నిర్వహించాలని వారు ఈ సందర్భంగా తెలిపారు.

## పెందుర్తిలో సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

**8 మంది లబ్ధిదారులకు రూ.7 లక్షల13 వేల 078లు చెక్కులు అందజేత**



**పెందుర్తి, పెన్ పవర్, జనవరి 5 :** పేదలు, మధ్యతరగతి ప్రజలకు అనారోగ్య సమయంలో సీఎం సహాయనిధి ఎంతగానో దోహదపడుతోందని జనసేన పార్టీ ఉమ్మడి విశాఖపట్నం రూరల్ జిల్లా అధ్యక్షులు, పెందుర్తి నియోజకవర్గ శాసనసభసభ్యులు పంచకర్ల రమేష్ బాబు అన్నారు. సోమవారం పెందుర్తి మండలం, సుజాతనగర్ క్యాంపు కార్యాలయంలో సీఎం సహాయనిధి ద్వారా కార్పొరేట్ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్యం పొందిన 8 మంది లబ్ధిదారులకు మొత్తం రూ.7,13,078 విలువైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఆయన పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడే సామాన్య ప్రజలకు ఆర్థిక భారం కాకుండా ప్రభుత్వం సీఎం సహాయనిధి ద్వారా అండగా నిలుస్తోంది. అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి. ప్రజల సంక్షేమమే మా ప్రభుత్వ ధ్యేయం" అని తెలిపారు. సీఎం సహాయనిధి లబ్ధిదారులు

సబ్బవరపు శశికాంత్, సబ్బవరం మండలం, అంతకపిల్లి గ్రామం రూ.85,253, కొండ్రపు రాజు జీవీఎంసీ 77వ వార్డు, నమ్మిదొడ్డి రూ. 34,255, చింతలపూడి సత్యప్రసాద్ జీవీఎంసీ 88వ వార్డు, సత్తివానిపాలెం రూ.2,50,541,

కర్రి రమ, సబ్బవరం మండలం, ఆసకపల్లి గ్రామం రూ.48,541, ఒడిసెల అప్పలరాజు పెందుర్తి మండలం, పినగాడి గ్రామం రూ.10వేలు, ముమ్మన చంద్రశేఖర్ జీవీఎంసీ 97వ వార్డు, చిన్నముసిడివాడ రూ.66,052,

కల్లేపల్లి వెంకటేష్ పెందుర్తి మండలం, గోరపిల్లి గ్రామం రూ.51,309, గోపాల శ్రియప్పంద్ జీవీఎంసీ 79వ వార్డు, లంకెలపాలెం రూ. 1,58, 123లు అందజేశారు.

ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు కొరుపోలు రామనాయుడు, పెందుర్తి పీఏసీఎస్ చైర్మన్ అయితే సింహాచలం, ఏఎంసీ డైరెక్టర్ ఆర్.ఎస్.నాయుడు, హైమావతి, వార్డు అధ్యక్షులు సోమశేఖర్, కాకి బాబు, పిన్నింటి పార్వతి, డిబిఎల్ నాయుడు, కంచిపాటి మధు పాల్గొన్నారు. అలాగే సీనియర్ నాయకులు బాయలుపూడి హరి గోపాల్, మండా సతీష్, జగన్మోహన్, రాపర్తి కిషోర్ గారు, వరూధిని గారు, రాపర్తి కృష్ణమోహన్, సదరం భీమేశ్వరరావు, గొర్రెపల్లి మోహన్ స్వరూప్, గొర్రెపల్లి ఈశ్వరరావు, అక్కిరెడ్డి నరసింహమూర్తి, గొర్ల అప్పారావు, సేనాతి దేముడు, నక్క శ్రీనివాస్, కొండ బాబు, వెంకటేశ్వరరావు తదితర పెందుర్తి మండలం ఉమ్మడి ఎన్‌డీఏ మహాకూటమి నాయకులు, కార్యకర్తలు, వీర మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమం సజావుగా ముగిసిన అనంతరం లబ్ధిదారులు సీఎం సహాయనిధి మంజూరుకు, ఎమ్మెల్యే గారికి కృతజ్ఞతలు తెలిపారు.

## సింహాద్రి అప్పన్నను దర్శించుకున్న క్రికెట్ ప్రముఖులు, రిఫరీలు



**సింహాచలం, పెన్ పవర్, జనవరి 5 :** ఆంధ్రప్రదేశ్‌లోని ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన శ్రీ వరాహలక్ష్మీనరసింహస్వామి వారి దేవస్థానం, సింహాచలంలో సోమవారం క్రికెట్ రంగానికి చెందిన ప్రముఖులు స్వామి వారిని భక్తిశ్రద్ధలతో దర్శించుకున్నారు. మహిళా క్రికెట్ రంగంలో ప్రతిభను చాటుకుంటున్న వి. కృతిక, నియతి లోకూర్లతో పాటు, అంతర్జాతీయ మరియు జాతీయ స్థాయిలో పేరుగాంచిన క్రికెట్ రిఫరీలు, అధికారులు అయిన శివ శుక్లా, చేతన్ శర్మ, సుబ్రత దాస్, అభిషేక్ తోమర్, రాకేష్ కుమార్ ఈ సందర్భంగా సింహాద్రి అప్పన్నను దర్శించుకున్నారు. ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం క్రికెట్ ప్రముఖులు దేవస్థానానికి చేరుకోగానే ఆలయ సంప్రదాయాల ప్రకారం సహాయకార్య నిర్వహణాధికారి కె.తిరుమలేశ్వరరావు, పర్యవేక్షణాధికారి కె.వెంకటేశ్వరరావు, అర్చకులు మరియు దేవస్థాన అధికారులు వారికి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ప్రత్యేక దర్శనం కల్పించగా, భక్తిశ్రద్ధలతో స్వామివారిని దర్శించుకున్నారు.వేద ఆశీర్వచనం ప్రసాదాల పంపిణీ

దర్శనానంతరం ఆలయ మండపంలో వేద పండితులు వారికి వేద ఆశీర్వచనం అందించారు. అనంతరం దేవస్థానం అధికారులు స్వామివారి ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమం భక్తిమయ వాతావరణంలో ప్రశాంతంగా జరిగింది.

భక్తి భావాన్ని చాటుకున్న క్రికెట్ ప్రముఖులు

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మహా పుణ్యక్షేత్రమైన సింహాచలంలో అప్పన్న స్వామిని దర్శించుకోవడం పూర్వజన్మ సుకృతం. ఇక్కడి ప్రశాంతమైన వాతావరణం, ఆధ్యాత్మిక శక్తి మనసుకు ఎంతో శాంతిని ఇస్తుంది" అని తమ అనుభూతులను వెల్లడించారు. క్రీడారంగంలో మరింత విజయాలను సాధించేలా స్వామివారి దీవెనలు లభించాలని ప్రార్థించినట్లు తెలిపారు. భక్తి, క్రీడల సమన్వయం, క్రికెట్ రంగానికి చెందిన ప్రముఖులు సింహాచల క్షేత్రాన్ని దర్శించుకోవడం భక్తి, క్రీడల మధ్య ఉన్న అనుబంధాన్ని మరోసారి చాటింది. ఆధ్యాత్మికత ద్వారా మానసిక బలాన్ని పొందుతూ, క్రీడారంగంలో మరింత రాణించాలనే వారి ఆకాంక్ష ఈ సందర్శనలో స్పష్టంగా కనిపించింది.

## నర్సీపట్నంలో మకరజ్యోతి మహోత్సవాలకు ఘనంగా ఏర్పాట్లు

**ముహూర్తపు రాట వేసిన కౌన్సిలర్ చింతకాయల రాజేష్**



**నర్సీపట్నం, పెన్ పవర్ (జనవరి 05) :**

నర్సీపట్నంలో మకరజ్యోతి మహోత్సవాల నిర్వహణకు రంగం సిద్ధమైంది. జనవరి 14, 15, 16 తేదీ లలో అత్యంత వైభవంగా జరగనున్న ఈ ఉత్సవాల ఏర్పాట్లను కౌన్సిలర్ చింతకాయల రాజేష్ సోమవారం ముహూర్తపు రాట వేసి లాంఛనంగా ప్రారంభించారు. ఆలయంలో విశేష పూజలు నిర్వహించిన అనంతరం, ఉత్సవ పనులకు ముహూర్తపు రాట వేసి, కరపత్రాలను ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా రాజేష్ మాట్లాడుతూ 1983 నుంచి అయ్యప్ప సేవా సంఘం ఆధ్వర్యంలో ప్రతి ఏటా ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తుండటం అభినందనీయమని, భక్తులందరూ ఈ వేడుకల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

ఆలయ కమిటీ సభ్యులు కార్యక్రమ వివరాలు తెలియజేశారు. జనవరి 14 నుండి 16 వరకు మూడు రోజుల పాటు ప్రతిరోజూ ఉదయం స్వామివారికి విశేష పూజలు, పంచామృతాభిషేకాలు జరుగుతాయన్నారు. ముఖ్యంగా 15వ తేదీ గురువారం సాయంత్రం 5 గంటలకు కేరళ వాయిద్యాలు, భజన బృందాలతో స్వామివారి రథయాత్రను అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. అదే రోజు రాత్రి 7 గంటలకు జాయింట్ కలెక్టర్, ఐజీ సత్యనారాయణ గారితో పాటు ప్రముఖ సంగీత దర్శకుడు కోటి, గాయకుడు మనో, సినీ నటుడు సత్యసాయి శ్రీనివాస్ తదితరులను సన్మానించనున్నారు. అనంతరం రోషన్ లాల్ ఆర్కెస్ట్రా వారి సంగీత విభావరి, గజముఖ నృత్య అకాడమీ వారి క్లాసికల్ డ్యాన్స్ ప్రదర్శనలు భక్తులను అలరించనున్నాయి.

ఉత్సవాల్లో చివరి రోజైన 16వ తేదీ శుక్రవారం రాత్రి ప్రముఖ కొరియోగ్రాఫర్ పండు మాస్టర్, జబర్దస్త్ మరియు ఢీ-షో ఫేమ్ ఆర్టిస్టులతో బాలు రైడర్స్ ఆధ్వర్యంలో డాన్స్ బేబీ డాన్స్ అనే ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేశారు.

ఈ మూడు రోజుల మహోత్సవాలకు ముఖ్య అతిథులుగా స్పీకర్ అయ్యన్నపాత్రుడు దంపతులు, టి.డి.పి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్ దంపతులు, కౌన్సిలర్ రాజేష్ దంపతులు హాజరవుతారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక టిడిపి నాయకులు, అయ్యప్ప స్వామి భక్తులు పాల్గొన్నారు.

## అభివృద్ధిలో దూసుకుపోతున్న జీవీఎంసీ 89వ వార్డు



**విశాఖ పశ్చిమ, పెన్ పవర్, జనవరి 5 :** గ్రేటర్ విశాఖ నగరం, 89వ వార్డు అభివృద్ధిలో వేగంగా ముందుకు సాగుతోంది. ఎల్లపువానిపాలెం, సంతోష్ నగర్, గణేష్ నగర్, ఎస్సీ కాలనీ పరిసర ప్రాంతాల్లో గత రెండు నెలల కాలంలో సుమారు రూ.50 లక్షల వ్యయంతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు నిర్వహించినట్లు స్థానిక వార్డు కార్పొరేటర్ దాడి వెంకట రమేష్ తెలిపారు. ఈ ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న మౌలిక సదుపాయాల సమస్యలను దృష్టిలో పెట్టుకుని డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచడం, సీసీ రోడ్ల నిర్మాణం వంటి పనులను చేపట్టినట్లు ఆయన వివరించారు. ముఖ్యంగా సంతోష్ నగర్, గణేష్ నగర్ ప్రాంతాల్లో డ్రైనేజీలు, సీసీ రోడ్ల నిర్మాణ పనులు ప్రస్తుతం వేగంగా కొనసాగుతున్నాయని చెప్పారు. ఈ అభివృద్ధి పనులను వార్డు కార్పొరేటర్ దాడి వెంకట రమేష్‌తో పాటు వర్క్ ఇన్స్పెక్టర్ రామకృష్ణ, వార్డు కార్యదర్శి గవ్వ భాస్కర్ కలిసి పర్యవేక్షించారు. పనులు నాణ్యత ప్రమాణాలతో, నిర్ణీత గడువులో పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు. రేపు బుధవారం కూడా పలు అభివృద్ధి పనులు కొనసాగనున్న నేపథ్యంలో, పనుల కారణంగా స్థానికులకు కొంత అసౌకర్యం కలగవచ్చని పేర్కొన్న కార్పొరేటర్ వెంకట రమేష్, ప్రజలు సహకరించాలని కోరారు. తాత్కాలిక ఇబ్బందులు ఉన్నప్పటికీ, పనులు పూర్తయిన తర్వాత శాశ్వత ప్రయోజనం కలుగుతుందని ఆయన భరోసా ఇచ్చారు. వార్డు అభివృద్ధే లక్ష్యంగా పాలకులు, అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారని, భవిష్యత్తులో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని కార్పొరేటర్ తెలిపారు.

## వనబలింగం గ్రామంలో సీసీ రోడ్డుకు శంకుస్థాపన



**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, జనవరి 5,**అల్లూరి సీతారామరాజు జిల్లా, గూడెం కొత్తవీధి మండలం మొండిగెడ్డ పంచాయతీ పరిధిలోని వనబలింగం గ్రామంలో 90 మీటర్ల పొడవైన సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ సర్పంచ్ ప్రియాంక, ఎంపీపీ బోయినకుమారి, వార్డు సభ్యురాలు సూకూరు ఈశ్వరమ్మ చేతుల మీదుగా కొబ్బరికాయ కొట్టి సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ గ్రామ అభివృద్ధిలో భాగంగా మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. సీసీ రోడ్డు నిర్మాణంతో గ్రామస్తులకు రాకపోకలు మరింత సులభమవుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు జర్త బాలన్న, వంతల రాజారావు, సీందేరి నారాయణరావు, కందుల లక్ష్మణరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు గబులంగి సతీష్‌కుమార్, గబులంగి సత్తిబాబు, కూటమి నాయకులు అడపా సత్తిబాబు, మచ్చల లింగమూర్తి, కొండేముల తెల్లన్న దొర (మాజీ ఎంపీటీసీ), కోరాబు పండు, పడల్,పొత్తురు రాజు పాల్గొన్నారు. అలాగే గ్రామస్తులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## దొడ్డికొండలో మాక్స్ సంఘం ఆధ్వర్యంలో మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం



**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, జనవరి 5** :అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్త వీధి మండలం దొడ్డికొండ గ్రామానికి చెందిన కొర్ర నారాయణ జనవరి 4వ తేదీ (ఆదివారం) మృతి చెందారు. ఈ నేపథ్యంలో మృతుని కుటుంబానికి తక్షణ సాయం కింద మట్టి ఖర్చుల నిమిత్తం శ్రీ మహిళా మాతోట పరస్పర సహాయ సహకార పొదుపు మరియు పరిమితి సంఘం (మాక్స్) ప్రతినిధులు దొడ్డికొండ గ్రామానికి చేరుకుని రూ.5,000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సంఘం ప్రతినిధులు సుబ్బారావు, దేవరపు అచ్చిబాబు మాట్లాడుతూ, మృతిచెందిన కొర్ర నారాయణ మాక్స్ సంఘం సభ్యుడిగా ఉన్నందున, ఆయన మరణానంతరం సంఘం నిబంధనల ప్రకారం తక్షణ ఆర్థిక సహాయం అందించడం జరిగిందని తెలిపారు. మృతుని సతీమణి సీతమ్మ, కుమారుడు బుజ్జిబాబులకు ఉప సర్పంచ్ గెమ్మెల చిలకమ్మ, పేసా కార్యదర్శి మాదిరి చంటిబాబు, గ్రామ పెద్దలు గెమ్మెల సుబ్బారావు, పనసల ఈశ్వరమ్మల సమక్షంలో ఈ ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొని మృతుని కుటుంబానికి తమ సానుభూతిని తెలిపారు.

## పక్షులను కాపాడుకుందాం ప్లాస్టిక్ కాలుష్యాన్ని తరిమికొడదాం

- ఒక్కసారి వాడి పడెసె ప్లాస్టిక్ వద్దే వద్దు.
- పక్షి సంరక్షణ కేంద్రాలు అధికంగా ఏర్పాటు చేయాలి.
- రావిరాల శృతి శ్రీ, జిల్లా సమన్వయకర్త, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్



**విశాఖ పెన్ పవర్ జనవరి 5:**పక్షులను కాపాడుకుందాం ప్లాస్టిక్ కాలుష్యాన్ని తరిమి కొడదాం అని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ విశాఖపట్నం జిల్లా ఇన్ఫర్మేషన్, ఎడ్యుకేషన్, కమ్యూనికేషన్ విభాగం సమన్వయకర్త రావిరాల శృతి పేర్కొన్నారు. సోమవారం ఉదయం ఎంవిపి కాలనీలోని ఆళ్వార్ దాస్ డిగ్రీ కళాశాల లో ప్రిన్సిపాల్ డాక్టర్ జగదీష్ అధ్యక్షతన పక్షుల దినోత్సవం సందర్భంగా గ్రీన్ క్లైమేట్ టీం ఎన్ జి ఒ పలు కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రకృతి ప్రేమికులు, పక్షి ప్రేమికులు, పక్షి వీక్షకులు ప్రతి సంవత్సరం జనవరి 5న పక్షుల పరిరక్షణ దినోత్సవాన్ని నిర్వహిస్తు పక్షుల వల్ల కలిగే లాభాలు వివరించాలన్నారు. అలాగే మప పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి అని కోరారు. ఒక్క సారి వాడి పడెసె ప్లాస్టిక్ వాడవద్దని పిలుపునిచ్చారు.

గ్రీన్ క్లైమేట్ టీం ఎన్ జి ఒ వ్యవస్థాపక కార్యదర్శి జెవి రత్నం మాట్లాడుతూ పక్షుల రక్షణ, వాటి మనుగడకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. కలుపు తీత, గడ్డి నివారణ కోసం వినియోగిస్తున్న రసాయన మందులు పక్షుల జీవనానికి మరణ శాసనంగా తయారయ్యాయి అని వివరించారు. ఈ రసాయన మందులు నివారించక పోతే భవిష్యత్తులో పక్షి జాతులు అంతరించి పోయే ప్రమాదం ఏర్పడిందన్నారు. ఇప్పటికే పూరేడు పిట్టలు కనబడటం లేదని, కత్తెర పిట్టలు, బంగారు పిచ్చుకలు బీ ఈటర్స్, చెమర కాకి అంతరించిపోయే ప్రమాదంలో ఉన్నాయన్నారు. ప్రపంచంలోని దాదాపు 10,000 పక్షి జాతుల్లో చాలా జాతులు అంతరించిపోయే ప్రమాదంలో ఉన్నాయని వివరించారు. అంతరించిపోతున్న పక్షుల రక్షణ కోసం పక్షి సంరక్షణ కేంద్రాలను అధిక సంఖ్యలో ఏర్పాటు చేయాలని కోరారు.

ప్రిన్సిపాల్ డాక్టర్ జగదీష్ మాట్లాడుతూ పక్షి అభిమానులు ఈ రోజును అనేక కార్యక్రమాలతో ఘనంగా జరుపుకుంటారని వివరించారు. ప్రధానంగా పక్షి వీక్షణ, పక్షులపై అధ్యయనం, ఇతరులకు అవగాహన కల్పించడం అవసరం అని చెప్పారు.

ప్రతి ఒక్కరూ పక్షి ప్రేమికులుగా మారాలని కోరారు. ప్రతి విద్యార్థి తమ వంతు బాధ్యతగా పక్షులకు ఆహారాన్ని, నీటినీ అందుబాటులో ఉంచాలని కోరారు.

ఈ కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొని మాట్లాడారు.

# చామగెడ్డలో కోటి పది లక్షలతో రెండు బ్రిడ్జిల నిర్మాణానికి శంకుస్థాపన





ముఖ్య అతిథిగా పాల్గొన్న టిడిపి నియోజవర్గ ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి

**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, జనవరి 5**: గూడెం కొత్త వీధి మండలం వంచుల పంచాయతీ చామగడ్డ గ్రామంలో కోటి పది లక్షల రూపాయల వ్యయంతో నిర్మించనున్న రెండు బ్రిడ్జిలకు శంకుస్థాపన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా, నియోజవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మండల టిడిపి అధ్యక్షులు పోత్తూరు కొండలరావు, మండల ప్రధాన కార్యదర్శి పసుపులేటి నాగమణి అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. చామగడ్డకు విచ్చేసిన గిడ్డి ఈశ్వరికి మండల కూటమి నాయకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆమె బ్రిడ్జి నిర్మాణ పనులకు కొబ్బరికాయలు కొట్టి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రహదారుల అభివృద్ధికి, సంక్షేమ కార్యక్రమాలకు అధిక ప్రాధాన్యం ఇస్తూ ప్రజలకు మౌలిక వసతులు కల్పించడంలో ముందుంటుందని తెలిపారు. ఈ బ్రిడ్జిల నిర్మాణంతో గ్రామస్తులకు రాకపోకలు మరింత సులభమవుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ అరకు పార్లమెంట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ గొర్లె వీర వెంకట్,టిడిపి మండల యూత్ అధ్యక్షులు ముర్ల కోటేశ్వరరావు, జనసేన పార్టీ మండల ప్రధాన కార్యదర్శి పొత్తూరు విష్ణుమూర్తి, ఎంపీటీసీలు రిమల రాజేశ్వరి, సరస్వతి,జనసేన అధ్యక్షులు కొయ్యం బాలు,చింతపల్లి ఏఎంసీ డైరెక్టర్ మొట్టడం సర్బన్న దొర పాల్గొన్నారు. అలాగే వంచుల గ్రామ కమిటీ అధ్యక్షులు అరడ గాబ్రియల్, సంకాడ జనసేన పార్టీ పంచాయతీ అధ్యక్షులు ఉల్లం ఈశ్వరరావు, జనసేన పార్టీ పంచాయతీ ఉపాధ్యక్షులు గుండ్లు రఘువంశి, సంకాడ గ్రామ కమిటీ అధ్యక్షులు దేశగిరి గోవిందరావు, జనసేన నేత పాంగి శ్రీను, యువత పంచాయతీ అధ్యక్షులు వనపల ఈశ్వరరావు, టిడిపి పంచాయతీ ప్రధాన కార్యదర్శి సాగిన రంగారావు, ఎల్‌కే పేట టిడిపి పంచాయతీ శెట్టి రామారావు, మొండిగడ్డ టిడిపి గ్రామ కమిటీ అధ్యక్షులు మాతే కామరాజు, టిడిపి యూనిట్ ఇన్‌చార్జి మామిడి చంటిబాబు, మాజీ టిడిపి మండల సెక్రెటరీ మామిడి నాగేంద్ర, అడప సత్తిబాబు, సద్ద బుజ్జబాబు, బిజెపి రాష్ట్ర నాయకులు అచ్యుత్, సీనియర్ బిజెపి నాయకులు బోండ్ల చిరంజీవి, కూటమి నాయకులు, గ్రామస్తులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## పీఎం జీవన్ జ్యోతి బీమా కింద రూ.2 లక్షల చెక్ పంపిణీ



**గూడెం కొత్త వీధి,పెన్ పవర్ జనవరి 5:**గూడెం కొత్త వీధి మండలం దామనాపల్లి పంచాయతీ పరిధిలోని దామనాపల్లి గ్రామానికి చెందిన కుందారి శ్రీను ఇటీవల సహజ మరణం చెందగా,ఆయన భార్య (నామినీ)కుందేరి చంద్రకళకు ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన (పీఎంజేజేబివై) కింద రూ.2 లక్షల చెక్కును చింతపల్లి యూనియన్ బ్యాంకు మేనేజర్ గౌతమ్ కుమార్ అందజేశారు. ఈ కార్యక్రమం గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంకు మేనేజర్ గౌతమ్ కుమార్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఇన్సూరెన్స్ పాలసీలు తప్పనిసరిగా తీసుకోవాలని, ముఖ్యంగా పీఎం జీవన్ జ్యోతి బీమా యోజన వంటి పథకాలు ఆపత్కాలంలో కుటుంబాలకు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ బ్యాంకు బిజినెస్ కరస్పాండెంట్ ఎం. మహేష్, సీఆర్‌ఓ సతీష్ కుమార్, స్థానిక సర్పంచ్ కే. రామకృష్ణ, పంచాయతీ సెక్రటరీ లక్ష్మి, వీఆర్‌ఓ టి. రామకృష్ణ, కూటమి సభ్యులు, రైతులు, సచివాలయ సిబ్బంది, డ్వాక్రా మహిళలు, వీఆర్‌పీలు తదితరులు పాల్గొన్నారు.

## తెదేపా కార్యకర్త కుటుంబానికి ఐదు లక్షల బీమా నగదు అందజేత



**గూడెం కొత్తవీధి,పెన్ పవర్,జనవరి 5:** గూడెం కొత్తవీధి మండలంలోని లకవరపు పేట పంచాయతీ, లకవరపేట గ్రామానికి చెందిన తెదేపా కార్యకర్త కంకిపాటి బోడేశ్వరరావు రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. వారి కుటుంబానికి సహాయం అందజేయడానికి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అందించిన బీమా నగదు ఐదు లక్షల రూపాయలు మృతుని భార్య కంకిపాటి ధారాలమ్మకి అందజేయబడింది. ఈ కార్యక్రమంలో తెదేపా ఇంచార్జ్ గిడ్డి ఈశ్వరి, గూడెం కొత్తవీధి మండల అధ్యక్షులు పోత్తూరు కొండలరావు, మండల ప్రధాన కార్యదర్శి పసుపులేటి నాగమణి, మరియు కూటమి సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంలో గిడ్డి ఈశ్వరి మాట్లాడుతూ, "ప్రతి తెదేపా కార్యకర్త కుటుంబానికి పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుంది. నాయకత్వం తెలుగుదేశం పార్టీ కార్యకర్తలను గుర్తించి, అవసర సమయంలో మద్దతు అందించడం జరుగుతూనే ఉంటుంది" అని తెలిపారు.

## చింతపల్లి పంచాయతీలో ప్రజల సమస్యలపై గ్రామసభ



- గ్రామపంచాయతీ సిబ్బందికి వస్త్రాలు పంపిణీ
- గ్రామ సర్పంచ్ దూరియా పుష్పలత

**చింతపల్లి పెన్ పవర్ డిసెంబర్ 05 :-** చింతపల్లి మేజర్ పంచాయతీ లో గ్రామసభను గ్రామ సర్పంచ్ దూరియా పుష్పలత అధ్యక్షత వహించి సోమవారం గ్రామ సభకు సర్పంచ్ గ్రామసభలో గ్రామస్తులు ఎదుర్కొంటున్న మౌలిక సదుపాయాల సమస్యలపై విస్తృతంగా చర్చ జరిపి వాటి పరిష్కారానికి అవసరమైన కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు ఆమె తెలిపారు. పంచాయతీ పరిధిలో ప్రజలకు అవసరమైన సీసీ రోడ్ల నిర్మాణం, త్రాగునీటి సమస్యల నివారణ, డ్రైనేజీ వ్యవస్థ మెరుగుదల, వీధి దీపాల ఏర్పాటు వంటి అంశాలపై గ్రామస్తుల నుంచి వచ్చిన వినతులను స్వీకరించినట్లు తెలిపారు. పరిష్కారానికి సంబంధిత శాఖలకు ప్రతిపాదనలు పంపించనున్నట్లు వెల్లడించారు. గ్రామీణ ఉపాధికి మెరుగైన హామీగా ఉపాధి అవకాశాలను మరింత పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఉపాధి హామీ పని దినాలను 100 రోజుల నుంచి 125 రోజుల వరకు పెంచడం దీని వల్ల గ్రామీణ ప్రజలకు అదనపు ఉపాధి లభిస్తుందని పేర్కొన్నారు. ఉపాధి పనులను పారదర్శకంగా నిర్వహించడంతో పాటు, అర్హులైన ప్రతి కుటుంబానికి పని కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు తెలిపారు. గ్రామసభలో పారిశుధ్యం, తాగునీటి సరఫరా, రహదారుల అభివృద్ధి, గ్రామాభివృద్ధి పనుల్లో ప్రజల భాగస్వామ్యం వంటి అంశాలపై కూడా చర్చ జరిగింది. గ్రామ అభివృద్ధికి గ్రామసభలు ఎంతో ఉపయోగపడతాయని ప్రజలు తమ సమస్యలను నేరుగా చెప్పుకునే వేదికగా గ్రామసభలు నిలుస్తున్నాయని సర్పంచ్ పుష్పలత అన్నారు. పంచాయతీ కార్యాలయంలో పంచాయతీ సిబ్బందికి నూతన వస్త్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ముక్కలి వెంకటరావు, ఎంపీటీసీ చిందాడ జయలక్ష్మి, గ్రామ కమిటీ అధ్యక్షులు రీమల ఆనందరావు, బీసీ సెల్ ఉపాధ్యక్షులు లక్కోజి నాగభూషణం, ఏఎంసీ డైరెక్టర్లు పెదిరెడ్ల బేతాళుడు, కే. కృష్ణమూర్తి, సతీష్ చిన్న, బిజెపి కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు కందుల శ్రీనివాసరావు, జనసేన నాయకుడు మధుతో పాటు పలువురు కూటమి నాయకులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## దామనపల్లిలో సర్పంచ్ కుందేరి రామకృష్ణ ఆధ్వర్యంలో గ్రామసభ



**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, జనవరి 5:** గూడెం కొత్త వీధి మండలం దామనపల్లి పంచాయతీ సర్పంచ్ కుందేరి రామకృష్ణ ఆధ్వర్యంలో సచివాలయం వద్ద గ్రామసభను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీలో పారిశుద్ధ్య పనులు, స్వచ్ఛ సంక్రాంతి, స్వచ్ఛ గ్రామపంచాయతీపై వివరణాత్మకంగా చర్చ జరిగింది. గ్రామాభివృద్ధి, పరిశుభ్రతకు తీసుకోవాల్సిన చర్యలను సర్పంచ్ రామకృష్ణ గుర్తు చేశారు. గ్రామస్తులు, వృత్తిపరులు, పార్టీ నాయకులు మరియు ఇతర అధికారులు కార్యక్రమంలో సక్రియంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ లక్ష్మి, వీఆర్వో రామారావు, ఉప సర్పంచ్ గేమ్మెల చిలకమ్మ, మాజీ ఎంపీపీ బాలరాజు, బీజేపీ నాయకులు దుక్కెరి ప్రభాకర్, వార్డు సభ్యులు మరియు గ్రామ పెద్దలు పాల్గొన్నారు. గ్రామ ప్రజల సహకారంతో స్వచ్ఛతా కార్యక్రమాలను మరింత విస్తృతంగా చేపట్టే అంశంపై చర్చ జరిగింది.

## భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం తో ఉత్తరాంధ్ర అభివృద్ధి - ప్రసాదుల శ్రీనివాస్



**గాజువాక:పెన్ పవర్,జనవరి05:**విశాఖపట్నం నుండి ఎక్కడో దూరంగా భోగాపురంలో విమానాశ్రయం నిర్మిస్తే ఫలితం ఎవరికని ఒకప్పుడు జగన్ మోహన్ రెడ్డి విమర్శించారని గాజువాక నియోజకవర్గ ఇన్చార్జ్ ప్రసాదుల శ్రీనివాస్ అన్నారు. గాజువాక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్రానికి గేమ్ ఛేంజర్ గా భోగాపురం ఎయిర్ పోర్టు నిలుస్తుందని అన్నారు. వైకాపా పార్టీ దీన్ని జీర్ణించుకోలేక రాష్ట్ర ప్రజలకు లేనిపోని అపోహలు సృష్టిస్తున్నారని తెలిపారు.

ఉత్తరాంధ్ర అభివృద్ధిపై సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి లోకేష్ ప్రత్యేక శ్రద్ధ పెట్టారని అన్నారు అంతర్జాతీయ.విమానాశ్రయంతో ఉత్తరాంధ్ర మరింత అభివృద్ధి పథంలో ముందుకెళ్తోందన్నారు. గతంలో విశాఖకి 40 కి.మీ దూరం లేని భోగాపురంలో మరో ఎయిర్ పోర్ట్ ఎందుకంటూ భూములివ్వొద్దని జగన్ రైతుల్ని రెచ్చగొట్టారన్నారు.

నేడు మాత్రం భోగాపురం తమ ఘనత అంటూ జగన్ చెప్పుకోవడం సిగ్గుచేటు, ఇంతకంటే దుర్మార్గం మరొకటి లేదు. ఇప్పటికైనా వైకాపా నాయకులు తప్పుడు ప్రచారాలు చేసుకోవడం మానేయాలని సూచించారు భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి స్వతంత్ర సమరయోధుడు అల్లూరి సీతారామరాజు పేరు పెట్టి మరింత గౌరవం తెచ్చారని అన్నారు ఈ.కార్యక్రమంలో నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు తమిరె శివప్రసాద్, నాయకులు సాలపు రామారావు దొడ్డిసత్యారావు, ప్రకాష్. కొరికిన చంద్రరావు, ప్రకాష్,కన్నారావు, భోగేశ్వరరావు, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రతిభకు టిడిపి పురస్కారాలు - ఉత్తమ కార్యకర్త జ్ఞాపికలు

- సుపరిపాలన లో తొలి అడుగు - మై టీడీపీ యాప్ నందు నమోదు ప్రతిభ కనబరిచిన కార్యకర్త'జ్ఞాపిక'అందజేసిన
- ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ బాబు



**విశాఖ తూర్పు,పెన్ పవర్, జనవరి 5:**కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తెలుగుదేశం పార్టీ ఆదేశాల మేరకు స్థానిక శాసనసభ్యులు వెలగపూడి రామకృష్ణ బాబు ఆధ్వర్యంలో 13 వ వార్డులో సుపరిపాలన లో తొలి అడుగు కార్యక్రమం ద్వారా బూత్ కన్వీనర్ లు, యూనిట్ ఇంచార్జ్ లు,క్లస్టర్ ఇంచార్జి సమక్షంలో ఇంటింటికి వెళ్ళి కూటమి ప్రభుత్వం పరిపాలన గురించి ప్రజల అభిప్రాయాలను మై టీడీపీ యాప్ నందు నమోదు చేసి ప్రతిభ కనబరిచిన వారికి శాసనసభ్యులు వెలగపూడి రామకృష్ణ బాబు,టిడిపి యువ నాయకులు వెలగపూడి ప్రతాపరుద్ర వార్డు కార్పొరేటర్ కెల్లా సునీత సత్యనారాయణ చేతుల మీదుగా వార్డు అధ్యక్షులు ఏడువాక సన్యాసిరావు,పార్లమెంట్ కమిటీ అధికార ప్రతినిధి పొత్రకశీడ ధర్మారావు,ఓశెట్టి పైడిరాజు,మచ్చ జ్యోతమ్మ, కర్రి మణి,కల్లూరి వెంకటేష్ లకు ఉత్తమ కార్యకర్త జ్ఞాపికలను ఎమ్మెల్యే పార్టీ కార్యాలయంలో సోమవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో వార్డు ప్రధాన కార్యదర్శి తురకపూడి బాలస్వామి,ఉపాధ్యక్షులు కిల్లం శెట్టి శ్రీనివాస్,మహిళా అధ్యక్షురాలు మజ్జి రమణి, కుర్రి లక్ష్మి,మజ్జి శ్రీదేవి,గలాల రమణమూర్తి, పేపకాయల పుష్ప లత,రామచంద్ర,రెడ్డి సత్తి రాజు తదితరులు పాల్గొన్నారు.

# కొత్తపాలెం పంచాయతీలో ప్రజా సమస్యలు పట్టించుకోని గ్రామసభ

- ప్రజల గొంతు వినని అధికారులెందుకు
- పేసా కమిటీ సభ్యుల సూటి ప్రశ్న



**చింతపల్లి పెన్ పవర్ జనవరి 5 :-** చింతపల్లి మండలంమండలం కొత్తపాలెం-1 సచివాలయం వేదికగా సోమవారం జరిగిన, గ్రామసభలో రీ సర్వే పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమం అధికారుల నిరంకుశత్వానికి అద్దం పట్టిందని పీసా కమిటీ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రీ సర్వేలో భూముల విషయంలో ఎదుర్కొంటున్న అనేక క్లిష్టమైన సమస్యలను ఉన్నతాధికారి దృష్టికి తీసుకెళ్లాలని ఆశగా వచ్చిన ప్రజలకు నిరాశే ఎదురైందనీ, స్వయంగా మండల మేజిస్ట్రేట్ హోదాలో ఉన్న ఎమ్మార్వో సభకు విచ్చేసినప్పుడు, తమ గోడు వింటారని ఆశించిన సామాన్యులకు కనీసం మాట్లాడే అవకాశం కూడా ఇవ్వకపోవడం దారుణమని వాపోయారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం జరగాల్సిన సభను కేవలం పట్టాదారు పుస్తకాల పంపిణీ ఫోటోలకు, మొక్కుబడి తంతుకు పరిమితం, చేయడంపై పెసా కమిటీ నాయకులు కిట్లంగి కృష్ణ, మఠం విజయ్, గేమ్మెలి రాజ్ కుమార్, సెగ్గె రామారావు, దొండ నాగరాజు, మొట్టడం రాజు బాబులు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. గ్రామసభ అంటే అధికారుల ప్రసంగాలు వినడానికి వచ్చే సభ కాదు, ప్రజల బాధలు పంచుకునే వేదికని వారు ఈ సందర్భంగా అధికారులకు గుర్తుచేశారు. అసలు రీ సర్వేలో జరిగిన లోపాలు, పట్టాదారు పుస్తకాల్లో దొర్లిన తప్పులను, ప్రజలు మాట్లాడటానికి ప్రయత్నిస్తుంటే సమయం లేదని వ్యవహరించడం అధికారుల అహంకారానికి నిదర్శనమని వారు ధ్వజమెత్తారు. ప్రజలకు సమస్యలు చెప్పుకునే స్వేచ్ఛ లేనప్పుడు ఈ సభలు ఎందుకు ప్రజాస్వామ్యంలో ప్రజల గొంతు నొక్కే హక్కు మీకెక్కడిది అంటూ అధికారులను సూటిగా ప్రశ్నించారు. కేవలం సభలు నిర్వహించడం గొప్ప కాదని, క్షేత్రస్థాయిలో ప్రజల మధ్యకు వచ్చి నేరుగా వారి నుండి సమస్యలను అడిగి తెలుసుకోవాలని, ప్రజా సమస్యలను నెరవేర్చే పూర్తి బాధ్యతను అధికారులు తీసుకోవాలని పెసా కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు.

## స్మార్ట్ పార్క్ ప్రారంభించిన ఎమ్మెల్యే గణబాబు

పట్టణాభివృద్ధికి మరో ముందడుగు



**విశాఖ పశ్చిమ, పెన్ పవర్, జనవరి 5 : స్థానిక** విశాఖ పశ్చిమ నియోజకవర్గంలోని 56వ వార్డు గవర కంచరపాలెంలో నూతనంగా అభివృద్ధి చేసిన స్మార్ట్ పార్క్ ప్రారంభోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్, విశాఖ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గణబాబు పాల్గొని పార్కును ప్రజలకు అంకితం చేశారు. ఈ స్మార్ట్ పార్క్ ప్రారంభం కేవలం ఒక అభివృద్ధి కార్యక్రమంగా మాత్రమే కాకుండా, పట్టణ ప్రజల జీవన నాణ్యతను మెరుగుపరిచే దిశగా తీసుకున్న కీలక నిర్ణయంగా భావించవచ్చు. వేగంగా విస్తరిస్తున్న నగర జీవనశైలిలో ప్రజలకు స్వచ్ఛమైన గాలి, విశ్రాంతి, వ్యాయామం వంటి మౌలిక అవసరాలు అందించడంలో ఇలాంటి పార్కులు కీలక పాత్ర పోషిస్తాయి.

ప్రత్యేకంగా గవర కంచరపాలెం వంటి జనసాంద్రత అధికంగా ఉన్న ప్రాంతంలో స్మార్ట్ పార్క్ ఏర్పాటు చేయడం ద్వారా చిన్నారులు, యువత, వృద్ధులు అన్నివర్గాల ప్రజలకు ఉపయోగకరమైన వసతులు అందుబాటులోకి వచ్చాయి. ఆధునిక సదుపాయాలు, హరిత వాతావరణం, భద్రతా ఏర్పాట్లు ఈ పార్కును ప్రత్యేకంగా నిలబెడుతున్నాయి.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే గణబాబు మాట్లాడుతూ, పట్టణ అభివృద్ధి అనేది భవనాలు, రహదారులకే పరిమితం కాకుండా ప్రజల ఆరోగ్యం, మానసిక ప్రశాంతతను కూడా దృష్టిలో ఉంచుకుని జరగాలని తెలిపారు. భవిష్యత్తులో కూడా నియోజకవర్గంలో ఇలాంటి ప్రజాప్రయోజన కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తామని ఆయన స్పష్టం చేశారు.

మొత్తంగా చూస్తే, గవర కంచరపాలెంలో స్మార్ట్ పార్క్ ప్రారంభం స్థానిక ప్రజల్లో సానుకూల స్పందనను తీసుకువచ్చి, పశ్చిమ నియోజకవర్గ అభివృద్ధిలో మరో మైలురాయిగా నిలిచే అవకాశముందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

## అడవిలో నిప్పు - ప్రత్యేకనివారణ చర్యలు“విస్తృత అవగాహన ర్యాలీ

రేంజ్ ఆఫీసర్ బి. అప్పారావు




**చింతపల్లి పెన్ పవర్ జనవరి 05 :-** రానున్న వేసవి కాలంలో అటవీ ప్రాంతాల్లో అగ్నిప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున ప్రజలు, గిరిజనులు అప్రమత్తంగా ఉండాలని చింతపల్లి అటవీరేంజ్ ఆఫీసర్ బి. అప్పారావు పిలుపునిచ్చారు. మంగళవారం రావిమానుపాకలు, నూతుల బంధ గ్రామాలతో పాటు బోడకొండమ్మ గుడి ఘాట్ రోడ్ పరిసరాల్లో “అడవిలో నిప్పు – నివారణ చర్యలు“ అనే అంశంపై అటవీ శాఖా సిబ్బంది విస్తృత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. అడవుల్లో సంభవించే మంటలు కేవలం చెట్లను మాత్రమే కాకుండా, దశాబ్దాలుగా పెరిగిన వృక్ష సంపదతో పాటు అమాయక వన్యప్రాణులను బూడిద చేస్తాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రకృతి ప్రసాదించిన ఈ జీవ సంపద నశించడం వల్ల పర్యావరణ అసమతుల్యత ఏర్పడి భవిష్యత్తులో మానవాళి తీవ్ర పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ముఖ్యంగా కాఫీ తోటల యజమానులు, గిరిజనులు తోటల సాగులో భాగంగా ఫైర్ లైన్ ఏర్పాటు చేసే సమయంలో గానీ, ఇతర వ్యర్థాలను కాల్చేటప్పుడు గానీ అశ్రద్ధ వహించకూడదని సూచించారు. మంటలు పెట్టినప్పుడు అవి పూర్తిగా ఆరిపోయే వరకు పర్యవేక్షించాలని, ఏ చిన్న నిర్లక్ష్యం వహించినా అది కార్చిచ్చులా మారి అడవిని దహించివేస్తుందని వారు వివరించారు. అటవీ ప్రాంతాల్లో సంచరించే వారు అగ్గిపెట్టెలు, బీడీలు, సిగరెట్లు వంటి మండే స్వభావం ఉన్న వస్తువులను వెంట తీసుకువెళ్లరాదని, పొరపాటున ఎక్కడైనా మంటలు కనిపిస్తే వెంటనే స్థానిక అటవీ సిబ్బందికి సమాచారం అందించి మంటలను ఆర్పడంలో సహకరించాలని కోరారు. అడవిని కాపాడుకోవడం ద్వారానే పర్యావరణాన్ని, మన ఆరోగ్యాన్ని రక్షించుకోగలమని వారు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎఫ్.బి.ఓ పి. వరహాల బాబు, డౌనూరు ఎఫ్.బి.ఓ వినోద్ కుమార్, ఏ.బి.ఓ సుమిత్ర, అటవీ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## అనంతవరం గ్రామం లేగ దూడల సందర్శన సర్పంచ్ ఆధ్వర్యంలో



**పద్మనాభం, పెన్ పవర్, జనవరి 05 :**పద్మనాభం మండలంలోని అనంతవరం గ్రామం లో రాష్ట్రీయ గోకుల్ మిషన్ కార్యక్రమంలో భాగంగా పశుసంవర్ధక శాఖ, పశుఘనాభివృద్ధి సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం లేగ దూడల ప్రదర్శన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వ హించారు. ఈ కార్యక్రమంలో రైతులు 42 లేగ దూడలను ప్రదర్శనకు తీసుకువచ్చారు.ఈ కార్యక్రమాన్ని జిల్లా ఉప సంచాలకులు ఎం. చంద్రశేఖర్ ప్రారంభించారు. ఉత్తమ లేగ దూడ లకు ఎంపికైన రైతులకు గ్రామ సర్పంచ్ గొర్రె పాటి వెంకట్ లక్ష్మి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ గొర్రెపాటి పెద్దిరినాయుడు, డీఎల్డీఏ ఈవో డా. సజ్జా శ్రీనివాసరావు బహుమతులు అందజేశారు.

ఈ సందర్భంగా ఉప సంచాలకులు ఎం. చంద్రశే ఖర్ మాట్లాడుతూ లేగ దూడల యాజమా న్యంలో పాటించాల్సిన పద్ధతులు, పోషకాహా రం, సంరక్షణపై రైతులకు అవగాహన కల్పించా రు. పశుసంవర్ధక శాఖ ద్వారా అమలు చేస్తున్న నట్టల నివారణ, టీకా కార్యక్రమాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. డీఎల్ డీఏ ఈవో డా. సజ్జా శ్రీనివాసరావు మాట్లా డుతూ ఎస్ఎస్ఎస్ (సెక్స్ సార్టెడ్ సెమెన్) ద్వారా ఆడ దూడల జననం పెరుగుతుందని, దీని వల్ల రైతులకు అధిక లాభాలు చేకూరుతా యని వివరించారు. ఈ సేవలను రైతులు విని యోగించుకోవాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో పద్మనాభం పశువైద్యాధికారి కె. మహేష్ కుమార్, రెడ్డిపల్లి పశువైద్యాధికారి జి. అనూష, పాండ్రంగి పశు వైద్యశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పిజిఆర్ఎస్‌లో 146, రెవెన్యూ క్లినిక్‌లో 141 అర్జీలు స్వీకరణ



జిల్లా కలెక్టర్ (ఎఫ్ ఎ సి) వై మేఘా స్వరూప్

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, జనవరి 5 :**తూర్పుగోదావరి జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన పిజిఆర్ఎస్ రెవెన్యూ క్లినిక్ కార్యక్రమాల్లో వరుసగా 146 , 141 అర్జీలు స్వీకరించినట్లు జిల్లా కలెక్టర్ (పూర్తి అదనపు బాధ్యతలు) వై మేఘా స్వరూప్ తెలిపారు. పిజిఆర్ఎ స్‌లో వచ్చిన అర్జీలను హేతుబద్ధతతో పరిశీలించి, సమస్యలు తిరిగి ఓపెన్ కాకుండా సమగ్ర పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు. పరిష్కరించిన అర్జీలపై అర్జీదారుల సంతృప్తి స్థాయిని ఐవీఆర్ఎస్ ద్వారా అభిప్రాయ సేకరణ చేయడం జరుగుతోందని కలెక్టర్ పేర్కొన్నారు. , పరిష్కారం కాని అంశాల విషయంలో స్పష్టమైన కారణాలను అర్జీదారులకు తెలియజేయడం అధికారుల బాధ్యతని తెలిపారు. పరిష్కారం లభించిన ప్రతి అర్జీకి సంబంధించి అర్జీదారుతో ఫోటో తీసి అప్లోడ్ చేయడం తప్పనిసరి అని స్పష్టం చేశారు. కాలపరిమితి పాటించడం, శాఖల మధ్య సమన్వయం, ఫీల్డ్ స్థాయిలో పరిశీలన, డాక్యుమెంటేషన్ పక్కాగా ఉండాలన్నారు.ఈ సందర్భంగా రెవెన్యూ క్లినిక్‌లో స్వీకరించిన 141 దరఖాస్తుల్లో హక్కుల రికార్డు 27, 22(ఏ) నుండి తొలగింపు 20, రీ-సర్వే ఫిర్యాదులు 17, ఇతర అంశాలు 17, అసైన్‌మెంట్‌లు 16, భూసేకరణపై ఫిర్యాదులు 8, రీసర్వే 7, ఆక్రమణలు/సాధారణ సర్వే 4, భూసేకరణ సమస్యలు 4, నమోదు సేవలు 3, వార్డు సచివాలయాలు మీసేవా (ఆదాయం) 2 తదితర విభాగాలుగా నమోదయ్యాయి. అలాగే పిజిఆర్ఎస్‌లో మొత్తం 146 దరఖాస్తుల్లో 134 ఆన్‌లైన్, 12 ఆఫ్‌లైన్లో స్వీకరించగా, శాఖల వారీగా పంచాయత్ రాజ్ మరియు గ్రామీణాభివృద్ధి 82, హోమ్ 14, మహిళలుపిల్లలువికలాంగులుసీనియర్ సిటిజన్లు 6, పరిశ్రమలు మరియు వాణిజ్యం 5గా అధికంగా ఉండగా, మిగిలిన శాఖలకు సంబంధించిన ఫిర్యాదులు ఉమ్మడిగా నమోదైనట్లు అధికారులు తెలిపారు.

ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి టి. సీతారామమూర్తి, సీపీవో ఎల్. అప్పలకొండ, డీఎస్పీ బి. విద్య, డీఎల్డీవో ఏ. స్లివా రెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు.రాజానగరం మండలం జి. యర్రంపాలెం గ్రామానికి చెందిన ఎస్కే. యూసుఫ్ తన అర్జీలో రెవెన్యూ శాఖ ద్వారా తనకు డీకేటీ పట్టా జారీ అయిందని, అయితే కొన్ని సాంకేతిక అభ్యంతరాల కారణంగా భూమికి సబ్ డివిజన్ చేయడం లేదని, అందువల్ల సబ్ డివిజన్ మంజూరు చేయవలసిందిగా కోరారు. వేమగిరికి చెందిన వై. ధనలక్ష్మి తన భర్త నవంబర్ 2023లో మరణించారని, ఇద్దరు పిల్లలతో ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నందున వితంతు పెన్షన్ మంజూరు చేయవ లసిందిగా అర్జీ సమర్పించారు.

తాళ్లపూడికి చెందిన మాజీ సైనికుడు మాండ్రు బాబురావు తనకు ఎక్స్‌మిలిటరీ కోటాలో సంక్రమించిన భూమి చూపించాలని కోరుతూ అర్జీ అందజేశారు. గోకవరం మండలం ఎస్సీ పేటకి చెందిన కొల్లపు అప్పలకొండ తనకు వారసత్వ హక్కుగా లభించిన భూమికి సంబంధించిన సమస్యను పరిష్కరించవలసిందిగా అర్జీ సమర్పించారు. రాజవోలుకి చెందిన బి.వి.వి. సత్యనారాయణ తన అర్జీలో కొత్తపేట2 ప్రాంతంలో రహదారిపై కంకర, ఇసుక పడివుండటంతో ప్రమాదాలు జరుగుతున్నాయని, తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. లాలాచెరువు సైక్లోన్ కాలనీకి చెందిన వి.వి.వి. రామారావు తన అర్జీలో కపిలేశ్వరపురం మండలం వెదురుమూడి గ్రామంలోని సర్వే నంబర్లు 50/2, 51/2లో తమకు చెందిన భూమిని ఉప్పెర్ల శేఖర్ అక్రమంగా ఆక్రమించుకున్నాడని, తమ భూమిని తమకు స్వాధీనం చేయించాలని కోరారు.

బిక్కవోలు మండలం కొమరిపాలెంకి చెందిన మాజీ జెడ్పీటీసీ పీవీ రామారెడ్డి తన అర్జీలో గ్రామంలో అక్రమ త్రవ్వకాలు జరుగుతున్నాయని, డిసెంబర్ నెలలో ఫోన్ ద్వారా విజిలెన్స్ ఎస్పీకి, జనవరి 2న కలిసి ఆధారాలతో కూడిన అర్జీ సమర్పించినప్పటికీ ఇప్పటివరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదని పేర్కొన్నారు. అక్రమ త్రవ్వకాల వల్ల ప్రభుత్వానికి జరుగుతున్న ఆర్థిక నష్టాన్ని నివారించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

## మీ భూమి మీ హక్కు పట్టాదారు పుస్తకాలు పంపిణీ



**చింతపల్లి పెన్ పవర్ డిసెంబర్ 05 :-** చింతపల్లి మండలం కొత్తపాలెం పంచాయతీ పరిధిలోడేగలపాలెం గ్రామంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన “మీ భూమి మీ హక్కు” కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ రాజముద్రతో ముద్రించిన పట్టాదారుల పాసు పుస్తకాలను అర్హులైన రైతులకు అధికారులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న చింతపల్లి మండల తహశీల్దార్ మాట్లాడుతూ, భూ హక్కులపై రైతులకు పూర్తి స్థాయి స్పష్టత కల్పించడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని తెలిపారు. భూమికి సంబంధించిన అన్ని వివరాలను ప్రభుత్వ రికార్డుల్లో నమోదు చేసి, రైతులకు చట్టపరమైన భద్రత కల్పించేందుకు ప్రభుత్వం “మీ భూమి మీ హక్కు” పథకాన్ని అమలు చేస్తోందని చెప్పారు. రాజముద్రతో జారీ చేసిన పట్టాదారుల పాసు పుస్తకాలు భూ వివాదాలకు ముగింపు పలుకుతూ రైతులకు శాశ్వత ఆధారంగా నిలుస్తాయని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో కొత్తపాలెం సర్పంచ్ సోమరత్నం, చింతపల్లి ఏఎంసీ చైర్‌పర్సన్ కిల్లో ఊర్మిళ, చింతపల్లి పాక్స్ చైర్మన్ గెమ్మెలి అబ్బాయినాయుడు, ఏఎంసీ డైరెక్టర్ చెన్నకేశవ మాట్లాడుతూ, రైతుల భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం దిశగా ఈ పథకం కీలకంగా మారుతుందని అభిప్రాయపడ్డారు. భూ హక్కుల భద్రతతో పాటు రైతుల ఆర్థిక అభివృద్ధికి ఇది దోహదపడుతుందని అన్నారు. అనంతరం ఎంపీటీసీ సభ్యులు, పీసా కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు రైతులకు పట్టాదారుల పాసు పుస్తకాలను అందజేశారు. భూములపై హక్కులు స్పష్టంగా లభించడంతో రైతులు ఆనందం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో చింతపల్లి మండల టీడీపీ అధ్యక్షులు కిల్లో పూర్ణచంద్రరావు, బీజేపీ మండల అధ్యక్షులు బాలకృష్ణ, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## హిందూ సనాతన ధర్మ పరిరక్షణలో కూటమి ప్రభుత్వం వైఫల్యం

- దేవాలయాలపై దాడులు చేసే వాళ్లను కఠినంగా శిక్షించాలి
- భోగాపురం విమానాశ్రయం ఘనత జగన్ కే దక్కుతుంది
- మీడియా సమావేశం లో మాజీ ఎంపీ మార్గాని భరత్




**రాజమహేంద్రవరం, పెన్ పవర్, జనవరి 5 :** వందల సంవత్సరాల నాటి పవిత్రమైన హిందు దేవాలయాలను, హిందూ సనాతన ధర్మ పరిరక్షణలో కూటమి ప్రభుత్వం వైఫల్యం చెందిందని వై యస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ జాతీయ అధికారి ప్రతినిధి మాజీ ఎంపీ మార్గాని భరత్ విమర్శించారు.

హిందు దేవాలయాలు అసాంఘిక శక్తుల ఆగడాలకు నిలయాలుగా మారినప్పటికీ వీటిని పరిరక్షించే బాధ్యతను ప్రభుత్వం విస్మరిస్తుందన్నారు. స్థానిక వై యస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం లో సోమవారం మీడియా సమావేశంలో మార్గాని భరత్ మాట్లాడుతూ, కలియుగ క్షేత్రమైన తిరుపతిలో గోవిందరాజుల స్వామివారి గుడి గోపురం ఎక్కి ఉన్మాది తన పాదాల కింద పవిత్ర దేవాలయాన్ని తొక్కుతూ చేసిన రాద్ధాంతం క్షమించరాని నేరమన్నారు. దక్షిణ కాశీగా పిలవబడే దాక్షారామ ఆలయంలో శివలింగం ధ్వంసం చేసిన వ్యక్తి తెలుగుదేశం పార్టీ క్రియాశీలక సభ్యుని తమ్ముడన్నారు. కాతేరు శిల్ప పాలయాల నుండి ఒక లింగాన్ని తీసుకువెళ్లి వేద పండితులతో సంప్రోక్షణ చేయకుండానే పునః ప్రతిష్టించారని విమర్శించారు.కృష్ణ పుష్కరాలలో 44 దేవాలయాల ధ్వంసం, గోదావరి పుష్కరాలలో 28 మంది తొక్కిసలాటలో దుర్మరణం, సిటీ లో సుబ్రమణ్యం స్వామి విగ్రహం చేతులు విరగగొట్టడం జరిగాయన్నారు.రాష్ట్రంలో దేవాలయా ల్లో అసాంఘిక కార్యక్రమాలు జరు గుతుంటే, సనాతన ధర్మమంటున్న ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ , కూటమి భాగస్వామ్యులు బీజేపీ ప్రభుత్వం, విశ్వ హిందూ పరిషత్, భజరంగ్ దళ్, ఆర్ఎస్ఎస్ లు స్పందించ డం లేదని, హిందూ ధర్మాన్ని ఎవరు కాపాడతారని ఆయన ప్రశ్నించారు. సిటీ లోని పేపర్ మిల్లు యాజమాన్యంతో చర్చించి కాలుష్య నియంత్రణకు తీసుకుంటున్న చర్యలను కూడా పరిశీలిస్తామని భరత్ తెలిపారు. భోగాపురం విమానాశ్ర యానికి శంకుస్థాపన 2023 లో అప్పటి ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి చేశారన్నారు. చంద్రబాబునాయుడే చేసారని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు అనడం హాస్యాస్పద మన్నారు. ఈ విమానాశ్రయం శంకుస్థాపన ఘనత వైయస్ జగన్ దేనని, ఎయిర్ పోర్ట్ కి, సీ పోర్ట్ కి అనుసంధానంగా 55 కిలోమీటర్ల రోడ్డుకి సుమారు 6300 కోట్ల రూపాయలు శాంక్షన్ చేయమని అడగడం జరిగిందన్నారు. కూటమి ప్రభుత్వం క్రెడిట్ చోరీ దీని మీదే గడుపుతున్నారు పరిపాలన. ఈ సమావేశంలో భరత్ తో పాటు మాజీ ఎమ్మెల్యే, రౌతు సూర్యప్రకాశ్ రావు పాల్గొన్నారు..

## అమ్మవారి ప్రత్యేక పూజ కార్యక్రమం లో పాల్గొన్న వడ్డీ రఘురాం నాయుడు



**తాడేపల్లిగూడెం, పెన్ పవర్ .జనవరి 05.**తాడేపల్లిగూడెం పట్టణంలోని సీతారాం పేట కొబ్బరితోట శ్రీ శ్రీ శ్రీ పుంతలో ముసలమ్మ తల్లి అమ్మవారి ఆలయంలో ఆదివారం రాజా త్రినాధ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమం లో వైస్సార్సీపీ రాష్ట్ర రైతు విభాగం ఆక్వా కల్చర్ వర్కింగ్ ప్రెసిడెంట్ వడ్డీ రఘురాం నాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వడ్డీ మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండి అంత సుభిక్షంగా ఉండాలని కోరుకున్నారు ఈ కార్యక్రమంలో వడ్డీతో పాటు కొప్పుల వెలమ మాజీ డైరెక్టర్ గొర్రెల శ్రీను, మాకరాజు సతీష్, కునుకు పుల్లయ్య, వింజమూరి శ్రీను, తానేటి అజయ్, సబ్బితి బ్రహ్మయ్య, మాకిరెడ్డి వెంకటేశ్వర రెడ్డి, రాంబాబు, చిన్నం సురేష్, బాబీ, మహేష్, చింటూ, గంగరాజు, సురేష్, ఆహ్వానం, సురేష్, నరేంద్ర, వెంకటేష్, కొండూబోయిన కృపావరం, వైఎస్ఆర్సిపి నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

# యర్రవరం సబ్ స్టేషన్ పరిధిలో గ్రామాలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం.

**ఏలేశ్వరం, పెన్ పవర్, జనవరి 5:** మండల పరిధి యర్రవరం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల విద్యుత్ వినియోగదారులకు మంగళ వారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని జగ్గంపేట విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బి వీరభద్రరావు సోమవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. మంగళవారం ఉదయం10 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు యర్రవరం విద్యుత్ సబ్‌స్టేషన్లో లో ఆర్ డి ఎస్ ఎస్ వర్కు నిమిత్తం యర్రవరం, తిరుమాలి, సిరిపురం ,చిన్నింపేట, పేరవరం తదితర ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపి వేయబడును. వినియోగదారులు డిపార్ట్మెంట్ వారికి సహకరించవలసిందిగా ఏ.ఈ. ఆ ప్రకటన లో విజ్ఞప్తి చేశారు.

## సామాన్య న్యాయవాదుల హక్కులను గెలిపించిన ఎమ్. వి రాజారామ్ కు అభినందనలు

మేడా శ్రీనివాస్ , ఆలా.



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, జనవరి 5 :**ప్రశ్నించే న్యాయవాదుల గొంతును నొక్కాలనే కుట్రతో బార్ కౌన్సిల్ ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే న్యాయవాద అభ్యర్థులు రూ. 1 లక్షా 25 వేల దరావత్తు చెల్లించాలనే నిబంధన ను "ఆంధ్ర లాయర్స్ అసోసియేషన్ (ఆలా) తరుపున సీనియర్ న్యాయవాది ఎమ్. వి రాజారామ్ న్యాయ పోరాటం చేసి న్యాయవాదుల హక్కును, స్వేచ్ఛను గెలిపించారు. వాజ్యం నెం : 29216/2025 ద్వారా 50,000 రుసుము చెల్లుంచుటకు న్యాయమూర్తుల ఆదేశాల మేరకు న్యాయవాదులకు అనుకూలంగా ఆయన విజయం సాధించారు .సీనియర్ న్యాయవాది ఎమ్. వి. రాజారామ్ కు ప్రతి జిల్లా నుండి న్యాయవాదులు అభినందనలు తెలిపారు . రాజమండ్రి నుండి బార్ కౌన్సిల్ మెంబెర్ గా పోటీ చేస్తున్న డి. వి. వి. త్రినాద్ , ఏ వి ఎల్ నరసింహారావు , విజయనగరం న్యాయవాది పి. భాగ్యరాణి, , విశాఖపట్నం దాడి మమతా వర్మ , జగన్నాధ సూర్య ప్రభావతి , తణుకు ఓ. ఎన్. కృష్ణ . గుంటూరు అవధానుల హరి , విజయవాడ ఆళ్ళ శ్రీహరి, తిరుపతి ఉడుం స్వాతి , కడప మల్లిఖార్జున రావు , కాకినాడ కట్టా ప్రతాప్ కుమార్ , ముమ్మిడివరం బొండా వెంకట సుబ్రహ్మణ్యశ్వరరావు , అమలాపురం మనోజ్ తదితర న్యాయవాదులు రాష్ట్రం నలుమూలల నుండి రాజారామ్ కు అభినందనలు తెలిపారు. ఈ విజయం న్యాయవాదుల విజయంగా బావించాలని, బార్ కౌన్సిల్ ఎన్నికల్లో రాజారామ్ ను అత్యధిక మెజార్టీ తో గెలిపించుకుంటే న్యాయవాదులకు విజయాలు చేరుస్తారని , న్యాయవాదుల భద్రత, సంక్షేమం, అభివృద్ధి రాజారామ్ తోనే సాధ్యం అని న్యాయవాదులు బావించాలని ,రాజారామ్ విజయానికి రాష్ట్ర న్యాయవాదులు కృషి చేయాలని
" ఆలా " ప్రధాన కార్యదర్శి మేడా శ్రీనివాస్ కోరారు ..

## కొత్త బరులు వస్తే అల్లర్లు ప్రభలేనా రాజకీయ నాయకులకు తలపోటేనా



**సీతానగరం, పెన్ పవర్, జనవరి 5:**సంక్రాంతిపండుగ వస్తుందంటే కుటుంబ సభ్యులందరికీ గుర్తొచ్చేది ఇంటి ముందు చక్కటి రంగు రంగుల ముగ్గులు గొబ్బెమ్మలు గంగిరెద్దులు, పిండి వంటలు, బావ మరదళ్ల అల్లర్లు, హరిదాసు వగైరా వంటివి. అయితే యువతకి గుర్తొచ్చేది గుండాట కోడిపందాలు పండుగ మూడు రోజులు ఆనందానికి అడ్డు అదుపు లేకుండా పోతుంది. ఒకపక్క మద్యం మరోపక్క కోడిపందాల్లో లక్షల రూపాయల సొమ్ములు చేతులు మారడం ఖాయం. సీతానగరం మండలంలోని గతంలో ఉన్న బరులే ఉంటాయా లేక అదనంగా వస్తాయా అనేది తెలియాలి ఈ సంవత్సరం కూటమి ప్రభుత్వంలో కొత్త నేతలు కొత్త వ్యక్తులు వస్తే అల్లర్లు ప్రబలే అవకాశం ఉందని ఇప్పటికే కొంతమంది కూటమినేతల్లో వివాదాలకు దారితీస్తున్నట్లు ఊహాగానాలు వినిపిస్తున్నాయి.

## వరుపుల తమ్మయ్య బాబు మృతి బాధాకారం.

* వైసిపి కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు.



**కిర్లంపూడి,పెన్ పవర్, జనవరి 5:**మాజీ ఎం పి పి, జనసేన పార్టీ సీనియర్ నాయకులు వరుపుల తమ్మయ్య బాబు అకాల మృతి బాధాకరమని తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించిందని ప్రత్తిపాడు నియోజకవర్గం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముద్రగడ గిరిబాబు అన్నారు. విషయం తెలిసిన వెంటనే తమ్మయ్యబాబు భౌతికకాయాన్ని సందర్శించి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.
ఈ సందర్భంగా గిరిబాబు మాట్లాడుతూ తమ్మయ్య బాబు మరణం తీరని లోటని వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని వారి కుటుంబ సభ్యులకు తీవ్ర ప్రగాఢ సంతాపన్ని, సానుభూతిని తెలియజేసారు.

# గోదావరి గట్టును పర్యాటకంగా అభివృద్ధి చేయాలి

* గోదావరి మధ్యలో మహా యోధుడు రాణా ప్రతాప్ సింగ్ 101 అడుగుల విగ్రహాన్ని నెలకొల్పాలి
* రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్
* అధ్యక్షులు మేడా శ్రీనివాస్



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, జనవరి 5 :** వచ్చే ఏడాది జరగనున్న గోదావరి పుష్కరాల సందర్భంగా వ్యయం చేసే పుష్కర నిధుల ఖర్చులపై తమ పార్టీ ప్రత్యేక నిఘా పెడుతుందని రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ వ్యవస్థాపక అధ్యక్షులు మేడా శ్రీనివాస్ తెలిపారు. అర్పిసి ప్రధాన కార్యాలయంలో అర్పిసి సీనియర్ సెక్యులర్ డివిఆర్. మూర్తి అధ్యక్షతన జరిగిన పార్టీ వారాంతపు సమావేశంలో అర్పిసి వ్యవస్థాపక అధ్యక్షులు మేడా శ్రీనివాస్ మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పర్యాటక అభివృద్ధికి నగరం అనువైనదని, నలుమూలల మెరుగైన ఆదాయ మార్గాలు ఉన్నప్పటికి వాటిని సద్వినియోగం చేయగల సమర్ధ అధికార యంత్రాంగం, పాలకులు లేకపోవటం దురదృష్టకరమన్నారు. పేరుకు మాత్రమే నగర పాలక సంస్థ గా రూపాంతరం చెందిందని, ఆదాయ, మార్గాలకు మించి నగర ప్రజలు పన్నులు చెల్లిస్తున్నారని, అందుకు తగిన సౌకర్యాలు మాత్రం వారు పొందలేక పోతున్నారన్నారు. నగరంలో 90శాతం ప్రాంతాలు ఆపా రిశుధ్యం, దుర్వాసన తాండవిస్తు న్నాయని, పూడికలు తీయని మురుగు కాలువలు, గుంతల రోడ్లతో ప్రజలు తీవ్ర సమస్యలు ఎదుర్కొంటు న్నారని ఆయన ఆవేదన చెందారు .నగరం లో గల గోదావరి గట్టును హైదరాబాద్ ట్యాంక్ బాండ్ మాదిరి కన్నా గొప్ప పర్యాటకం గా అభివృద్ధిని చేయగల అవకాశాలను ప్రభుత్వం గుర్తించాలన్నారు. స్టానిక శేషయ్యమెట్ట నుంచి పురుషోత్త పట్నం గ్రామం వరకు సుమారు 30 కిలోమీటర్ల మేర గోదావరి గట్టును పర్యాటకంగా ప్రభుత్వం అభివృద్ధి చేస్తే యావత్ దేశంలో అబ్బుర పడే ప్రకృతి అందాలు, సుందరకరణ నగర సొంతమన్నారు . పర్యాటక అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి సారిస్తే ఉమ్మడి గోదావరి జిల్లాల్లో ఉద్యోగ, ఉపాధి మార్గాలు అభివృద్ధి చెందుతాయని , ప్రభుత్వనికి సైతం ఆదాయం లభిస్తుందన్నారు.
విజయవాడ , విశాఖపట్నం ల మధ్య అనుసంధానంగా ఉన్న ఈ నగరం
రైల్వే రవాణాకు అనువైన ప్రాంతమని, రైల్వే విడి భాగాల పరిశ్రమను స్థాపించాలని, దాంతో రైల్వే శాఖకు రవాణా, తయారి ఖర్చు తగ్గుతుందని, ఈ ప్రాంత ప్రజలకు మెరుగైన ఉపాధి లభిస్తుందన్నారు . ప్రభుత్వ రంగ సంస్థల నిర్మాణం జరిగితే ఈ పరిసర ప్రాంతాలు పెద్ద ఎత్తున అభివృద్ధి చెందుతా యన్నారు . ఉమ్మడి గోదావరి జిల్లాల్లో నిరుద్యోగత , నేర వ్యవస్థ కూడా తగ్గు ముఖం పడుతుంద న్నారు.గోదావరి పరివాహిక ప్రాంతాన్ని ఆనుకుని కోటిలింగాల రేవు వద్ద దక్షిణ కాశీ శ్రీ ఉమా కోటిలింగేశ్వర స్వామి దేవాలయం, చరిత్రత్మాకమైన పాపికొండలు, గోషాప్పాదాల క్షేత్రం , పుష్కరాల రేవు , గౌతమి ఘాట్ , పట్టిసీమ వంటి పసిద్ధ పుణ్య ప్రాంతాలు వుండటం ప్రజలు అదృష్టంగా బావిస్తారన్నారు. విదేశీ ఆక్రమణ దారులకు భారతీయ పౌరుషం , వీరోచితాన్ని చూపిన మహా యోధుడు రాణా ప్రతాప్ సింగ్ 101 అడుగుల విగ్రహాన్ని గోదావరి మధ్యలో నెలకొల్పితే పర్యాటకుల దృష్టిని నగరం ఆకర్షిస్తుందన్నారు.
గోదావరి పుష్కరాలు 2027 సందర్బంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుతం ప్రభుత్వం రూ. 3000 కోట్లు నిధులను ఖర్చు చేస్తున్నట్టుగా చెప్పిందన్నారు. 50 శాతం నిధులను పూర్తిగా నగర అభివృద్ధికి, జలకాలుష్య నివారణకు , పర్యావరణ రక్షణకు , పర్యాటక అభివృద్ధికి వినియోగించాలన్నారు. పుష్కర నిధులు ఖర్చుపై రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ నిఘా దృష్టి సారిస్తుందన్నారు. పుష్కర నిధులు దుర్వినియోగం చేసిన అధికారుల పైన , దారి మళ్ళించిన నేతలు, పాలకుల పైన న్యాయపరమైన చర్యలకు ఉపక్రమిస్తామని అర్పిసి అధ్యక్షులు మేడా శ్రీనివాస్ హెచ్చిరించారు. ఈ సమావేశంలో అర్పిసి సెక్యులర్స్ సిమ్మా దుర్గారావు , దుడ్డే సురేష్ , వర్ధనపు శరత్ కుమార్ , ఎమ్. డి హుస్సేన్ , కారుమూరి యుగంధర్ , దుడ్డే త్రినాద్ , వల్లి శ్రీనివాసరావు , దుర్గా ప్రసాద్ , జ్యోతిష్ , బాల మురళి కృష్ణ , చల్లా సాంబశివరావు , చల్లా అఖిల్ , మాసా అప్పాయమ్మ , అడపా శేషగిరి , పి. కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

## కాలువలో చెత్త వేస్తున్న వారిపై చర్యలు తప్పవు



నీటి సంఘం అధ్యక్షడు గారపాటి

**ఆలమూరు, పెన్ పవర్, జనవరి 05:**పంట కాలువల్లో చెత్త చెదారం వేసేవారిపై కఠిన చర్యలు తప్పవని చింతలూరు నీటి సంఘం అధ్యక్షుడు గారపాటి శ్రీనివాస్ చౌదరి అన్నారు. మండలంలోని జొన్నాడ ప్రధాన కాలువ, పిల్ల కాలువలలో చెత్తాచెదారం నిండి ఉండడాన్ని చూసి సోమవారం దిగ్భ్రాంతిని వ్యక్తం చేసి సంబంధిత పంచాయతీ అధికారులతో పరిస్థితిని సమీక్షంచారు. అలాగే ప్రోక్లెన్ వినియోగించి వాటి తొలగింపులు తోపాటుగా కాలువల్లో పెరిగిన తూటు కాడ, గుర్రపు డెక్క వంటి వాటిని తొలగింపులు చేపట్టారు. అలాగే ప్రధాన కాలువలో అటుగా వెళ్లేవారు కానీ స్థానికులు గాని ఎవరైనా చెత్తాచెదారం వేస్తూ ఉంటే ఫోటో తీసి నాకు పంపించాలని నీటిపారుదల శాఖ సిబ్బందికి ఆదేశించారు. అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటానని గారపాటి కఠినంగా చెప్పారు. ఈ విషయంపై ప్రతినెల ప్రభుత్వం మూడో శనివారం ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలో స్వర్ణాంధ్ర స్వచ్ఛంద కార్యక్రమాలు నిర్వహిస్తుందన్నారు. దీనిపై ప్రజల్లో మార్పు రావాలని, పూర్తి అవగాహన రాహిత్యంతో కాలువల్లో ఇలాంటి చెత్త చెదారం చేయడం వల్ల నీటి ప్రవాహానికి అటంకంగా కలుగుతుందన్నారు. అంతేకాకుండా సాగు నీరు కలుషిత వాతావరణంలో సరఫరా అవుతాయన్నారు. కాబట్టి మన పరిసరాలు మనం పరిశుభ్రంగా ఉంచుకోవాలని గారపాటి హితవు పలికారు.

## వికసిత్ భారత్ జీ రామ్ జీ పథకంపై గ్రామ సభ




**ఆలమూరు, పెన్ పవర్, జనవరి 05;**మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి కొత్త రూపుగా వికసిత్ భారత్ జిరామ్ జీ పథకంపై మండలంలోని జొన్నాడ పంచాయతీ సర్పంచ్ కట్టా శ్రీనివాసరావు అధ్యక్షతన సోమవారం గ్రామ సభ నిర్వహించారు. 125 రోజుల వేతన ఉపాధి హామీ తో పాటు నీటి భద్రత, రైతాంగానికి మేలు చేసేవిధంగా వికసిత్ భారత్ జీరామ్ జీ ఉండబోతుందని తెలిపారు. ప్రజలకు ఉపయోగపడే ఆస్తులు ఏర్పాటు చేసే విధంగా, మౌలిక సదుపాయాల కోసం, రహదారుల అనుసంధానం కోసం, గ్రామ పంచాయతీ భవనాలు, పాఠశాల గదుల నిర్మాణం, పారిశుద్ధ్య నిర్వహణ కోసం ఈ పథకం ఉపయోగ పడుతుందన్నారు. గతంలో 100 రోజులు ఉన్న పనిదినాల సంఖ్య నేడు 125 రోజులకు పెరగడం, వ్యవసాయ పనులకు ఆటంకం లేకుండా 60 రోజులు వ్యవసాయ పనుల సమయంలో విరామం ఉంటుందన్నారు. మిగిలిన రోజుల్లో 125 రోజులు ఉపాధిహామీ గ్యారంటీ లభించడం పేదప్రజలకు మేలు చేసేవిధంగా ఉందని తెలియజేశారు. జీవనోపాధి పెంచడం కూడా ఈ పథకంలో భాగం అన్నారు. పరిసరాలు బాగుండాలంటే అందరూ పారిశుద్ధ్య కార్మికులకు సహకారం అందించాలన్నారు. పారిశుద్ధ్య కార్మికులు అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని కొనియాడారు. మన ఇల్లు ఎంత బాగున్నా, మన వీధులు, గ్రామాలు, పరిసరాలు పరిశుభ్రంగా లేకపోతే మనం అనారోగ్యం పాలవడం గ్యారంటీ అన్నారు. అందుకే అందరూ పరిసరాల పరిశుభ్రత పై దృష్టి సారించాలన్నారు.అలాగే అంగన్వాడీ కార్యకర్తలు వారి యొక్క విధులను సక్రమంగా నిర్వహిస్తున్నారని అందుచేతనే మన గ్రామానికి జిల్లా స్థాయిలో స్వచ్ఛత అవార్డు లభించిందని మీగతా వారందరూ కూడా కృషి చేసి మరిన్ని అవార్డులు తీసుకుని రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ కార్యదర్శి కె కృష్ణ హెల్త్ అసిస్టెంట్ కె వెంకటేశ్వరరావు, నేతలు ఆదిత్య రెడ్డి,నామాల సూరిబాబు, వార్డు సభ్యులు, ఆర్బికే, హెల్త్, సచివాలయం, అంగన్వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు

**ఆలమూరు, పెన్ పవర్, జనవరి 05;**స్త్రీలకు విద్య ద్వారానే, స్వయం సమృద్ధి ఏర్పడుతుందని విశ్వసించి, దేశంలో తొలి బాలికా పాఠశాలను స్థాపించి, భారతదేశపు మొదటి మహిళా ఉపాధ్యాయునిగా ఎన్నో అవమానాలను, మరెన్నో అవాంతరాలను అధిగమించి, మహాత్మ జ్యోతిరావు పూలే ఆశయాలకు ధీటుగా నిలబడిన ధీర వనిత సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు సోమవారం ఎస్ టి యు ఆలమూరు మండల శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఇందులో మండలంలోని మూడు క్లస్టర్ల ప్రధాన పాఠశాలలైన చెముడులంక, నర్సిపూడి, ఆలమూరు ఉన్నాయి. అలాగే ప్రధాన ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఉమ, సుజాత, వి.మాధవిలత, పి.వెంకటలక్ష్మి, ఎం.నాగ లలిత కుమారి, సిహెచ్. సుహాసిని రాణి లకు వారంతా ఘన సన్మానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ టి యు మండల శాఖ అధ్యక్షులు సలాది శ్రీనివాసు, ప్రధాన కార్యదర్శి వాసా దుర్గాప్రసాద్, ఆర్థిక కార్యదర్శి ఎం.దాస్, మండల శాఖ మహిళా అధ్యక్షురాలు



పి.శ్రావణి, జిల్లా మహిళా కార్యదర్శి సుజాత, రాష్ట్ర కౌన్సిలర్ చక్రవర్తి, విద్యా భవన్ కన్వీనర్ ఎస్.ఎన్. మూర్తి, సి.పి.ఎస్ కన్వీనర్ ప్రకాష్ సీనియర్ నాయకులు రాజగోపాల్, యేసు రాజు, చంద్రరావు, తదితరులు పాల్గొన్నారు.

## ఎరువుల రాయితీని రైతులు వినియోగించుకోవాలి






**కాట్రేనికోన పెన్ పవర్ జనవరి :5:**కాట్రేనికోన మండలం లో వ్యవసాయాధికారి మండల తహసీల్దార్,సర్పంచ్ సుధాకర్ ఆధ్వర్యంలో కాట్రేనికోన రైతు సేవకేంద్రం నందు రబీ సాగుకు ప్రణాళిక గా యూరియా సబ్సిడీ పై రైతులకు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారి మాట్లాడుతూ కాట్రేనికొన మండలశీ లో 60 మెట్రిక్ టన్నులు
యూరియా రైతులకు అందుబాటులో ఉన్నాదని తెలియజేయడం జరిగింది. అలాగే శ్రీ వెంకటేశ్వర సుబ్రమణ్య ట్రేడర్స్ నందు ఎమ్మార్వో ,ఏవో తనిఖీ చేసి యూరియా ప్రభుత్వం సూచించిన ఎం ఆర్ పి ధరలకే అమ్మాలని చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో కాట్రేనికొన వి ఏ ఏ లు మనోజ్, దేవేంద్ర,సుధ మరియు రైతులు కంచర్ల రామకృష్ణ,విత్తనాల బుజ్జి, శీలం సూర్యనారాయణ పితాని రమేష్, గుబ్బల చంద్రరావు,మొదలగు రైతులు పాల్గొన్నడశీ జరిగింది.

## వేణుగోపాల స్వామి దేవస్థానం భూమి కౌలు బహిరంగ వేలంపాట విజయవంతం

**కొత్తపేట, పెన్ పవర్, జనవరి5;**డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా, కొత్తపేట మండలం, మందపల్లి గ్రామంలో వేంచేసియున్న మందపల్లి క్షేత్ర పాలకుడైన శ్రీ వేణుగోపాల స్వామి వారి దేవస్థానానికి చెందిన ఆస్తుల కౌలు హక్కుల కోసం బహిరంగ వేలంపాట నిర్వహించబడింది. దేవస్థానం పరిధిలోని కొత్తపేట గ్రామం, సర్వే నంబరు 5/1 లో గల యా.1-04 సెంట్ల మెరక భూమిని మూడు సంవత్సరాల కాలానికి కౌలు శిస్తునకు ఈ వేలంపాట నిర్వహించారు.
ఈ బహిరంగ వేలంపాటలో చెల్లిరేవు గ్రామానికి చెందిన బొక్కా నాని సంవత్సరానికి రూ.51,500 చెల్లించేందుకు హెచ్చుపాట పాడుకొని కౌలు హక్కులను దక్కించుకున్నారు. గత సంవత్సరంలో ఈ భూమికి కౌలు శిస్తు రూ.15,000గా ఉండగా, ఈసారి వేలంపాట ద్వారా దేవస్థానానికి గణనీయమైన ఆదాయం లభించినట్లు ఆలయ కార్యనిర్వాహణ అధికారి,సహాయ కమిషనర్ దారపురెడ్డి సురేష్ బాబు తెలిపారు.వేలంపాట కార్యక్రమాన్ని గోపాలపురం గ్రూప్ టెంపుల్స్ కార్యనిర్వహణాధికారి బి. కిరణ్ పర్యవేక్షణ అధికారిగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మందపల్లి దేవస్థానం ధర్మకర్తల మండల సభ్యులు గవర వీర వెంకట సత్యనారాయణ, దేవపాటి వెంకటేశ్వరరావు అలాగే గ్రామ పెద్దలు ,స్థానికులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.దేవస్థానం ఆస్తులను పారదర్శకంగా నిర్వహిస్తూ, ఆదాయం పెంపుదల దిశగా ఇలాంటి బహిరంగ వేలంపాటలు నిర్వహిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు.



Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at H.NO: 38-4-216, MAHARANI STREET, MARRIPALEM, Visakhapatnam,Andhrapradesh-530018, Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, editorpenpower@gmail.com